## సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు : కలెక్టర్ రాహుల్‌రాజ్

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం చిన్నశంకరంపేటలో కౌలురైతు దడువాయి నర్సింలు వరి పొలంలో కలుపు తీస్తున్న మహిళలతో ముచ్చటించారు. ఏ పంటలను ఎక్కువగా సాగు చేస్తున్నారు అని రైతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఎమైనా సమస్యలు ఉన్నాయని అని అడిగారు. పంటల రక్షణకు తిసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించి లాభదాయక సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా, విద్యుత్తు,త్రాగునీటి సమస్యలు ఎమైనా ఉన్నాయని అని ఆరా తీశారు. జిల్లాలో ఎరువులు,పురుగుల మందులకు కొరత లేదని, మండల వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో రైతుల పంటపొలాలను సందర్శించాలని సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులకు ఎవైనా సమస్యలు, సందేహాలున్నా మండల వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి లక్ష్మీ ప్రవీణ్‌లు ఉన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు

**సిర్గాపూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని నోడల్ అధికారి (జిల్లా హార్టికల్చర్ అధికారి) మండల అధికారులతో కలిసి పరిశీలించారు. ఓట్లు వేసేందుకు వచ్చే ఓటర్లకు సమస్యలు తలెత్తకుండా తగు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అదికారులను ఆదేశించారు.



ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు



కలెక్టర్‌కు ఓటర్‌స్లిప్‌ను అందజేస్తున్న తహశీల్దార్ సింధు రేణుక

## ప్రతీ ఓటర్‌కు స్లిప్‌ను అందజేయాలి

### -మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** ప్రతీ ఇంటికీ ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్(ఓటర్ స్లిప్) అందజేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో హవేలీ ఘనపూర్ తహశీల్దార్ సింధురేణుక కలెక్టర్‌ను కలిశారు. హవేలీ ఘనపూర్ మండలం జిల్లా పరిషత్ హైస్కూల్ ఔరంగాబాద్‌లో పోలింగ్ స్టేషన్ నెంబర్ 428లో కలెక్టర్ రాహుల్‌రాజ్ తన ఓటుహక్కుకు సంబంధించిన ఓటర్‌స్లిప్‌ను తహశీల్దార్ ద్వారా తీసుకోవడం జరిగింది. కలెక్టర్, ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్ మాట్లాడుతూ ఓటర్ స్లిప్స్ పంపిణీ పూర్తయిన తరువాత రిపోర్టు సమర్పించాలని సంబంధిత అధికారులు, తహసీల్దార్‌లను ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం ఓటర్ స్లిప్స్ పంపిణీ ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్, ఉపధ్యాయులు తమ ఓటు హక్కును ఈ నెల 27వ తేదీన తమ పోలింగ్ కేంద్రాలలో వినియోగించుకోవాలని, తద్వారా ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉంటుందని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో హవేలీ ఘనపూర్ తాహశీల్దార్ సింధు రేణుక, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ బూతులను పరిశీలించిన ఆర్డీఓ



కుకునూరుపల్లిలో పోలింగ్ బూతులను పరిశీలిస్తున్న అర్డీవో చంద్రకళ

**కొండపాక, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** గురువారం కుకునూరుపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేస్తున్న ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన రెండు పోలీంగ్ బూతును గజ్వేల్ ఆర్డీఓ వివిఎల్ చంద్రకళ తహసీల్దార్ దండి సుజాతతో కలిసి పరిశీలించారు. బూత్ రూంలు, ఓటింగ్ జరిగే బూత్‌ల్లో విద్యుత్ సౌకర్యాలను హెచ్‌ఎం, ఎంఈఒ సత్తయ్యను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట అర్‌ఐలు సత్యనారాయణ, హరీష్ పాల్గొన్నారు. అదే విధంగా కొండపాక మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేస్తున్న రెండు పోలింగ్ బూతులను అమె పరిశీలించారు. అమె వెంట డిప్యూటి తహసీల్దార్ లావణ్య, అర్‌ఐ బాలకిషన్ పాల్గొన్నారు.

## సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటించాలి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న జైపాల్ నాయక్

**పుల్‌కల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని దేశ వ్యాప్తంగా సెలవు దినంగా ప్రకటించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు జైపాల్‌నాయక్ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డికి వినతి చేశారు. గురువారం హైద్రాబాద్‌లోని రవీంద్ర భారతిల నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు కేంద్ర మంత్రి హాజరు కాగా జైపాల్‌నాయక్ మంత్రికి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా జైపాల్‌నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంతో చర్చించి జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని వినతి చేశామన్నారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ జడ్పీటిసి సభ్యులు రాజు రాథోడ్, నాయకులు రవీందర్, అకేష్‌నాయక్, మాలోత్ గోపి, ఓడిఎఫ్ ఎస్సీ ఎంప్లాయిస్ అసోసియేషన్‌నాయకులు మూడ్ రవీందర్ తదితరులు ఉన్నారు.

### కోనాపూర్ సహకార సంఘంలో

## నిధుల దుర్వినియోగంపై విచారణ

### పాత, కొత్త సంఘ సభ్యులచే వాంగ్మూలం సేకరణ....

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జరిగిన రెండు కోట్ల రూపాయల నిధుల దుర్వినియోగం జరిగిందని సొసైటీ మాజీ చైర్మెన్, ఇఫ్కో డైరెక్టర్, మాజీ ఎమ్మెల్యే పద్మ భర్త దేవేందర్‌రెడ్డిపై ఆరోపణలు రావడంతో అప్పటి టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో విచారణ కూడా జరిపారు. కానీ తమకు సరైన న్యాయం జరగలేదని మాజీ సొసైటీ సభ్యులు ఆరోపిస్తూ ఫిర్యాదులు చేయడంతో ప్రస్తుత ప్రభుత్వం మళ్లీ విచారణ మొదలుపెట్టింది. అందులో భాగంగానే సంగారెడ్డి విచారణ కార్యాలయం నుండి అంజయ్య అనే అధికారిని విచారణ అధికారిగా ఎంపిక చేయడం జరిగింది. ఈమేరకు అంజయ్య ఒక ప్రకటన విడుదల చేస్తే గతంలో జరిగిన ఆరోపణలు మరియు అవినీతిపై ప్రత్యేక దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో బాగంగానే నేటి నుండి విచారణ ప్రారంభించామని ఈరోజు సొసైటీ మాజీ సభ్యులను విచారించామన్నారు. 21న ప్రస్తుత సభ్యులు, 22న సొసైటీకి సంబంధించిన పెట్రోల్‌పంపు ఉద్యోగులను, 23న సొసైటీ మాజీ చైర్మెన్ దేవేందర్‌రెడ్డి, మరియు మాజీ సీఈవో గోపాల్‌రెడ్డిలను విచారించి, వారి వాంగ్మూలం తీసుకోనున్నామన్నారు. సేకరించిన సమాచారం అంతా ఈనెల 25న ఎంక్వయిరీ కమీషనర్‌కు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

## బాలికల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**నంగునూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** బాలికల వసతి గృహాలలో భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఆదేశించారు. మండల పరిధిలోని గట్లమల్యాల గ్రామంలోని షెడ్యూల్ కులాల బాలికల సంక్షేమ వసతి గృహాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో డార్మెటరీ, వంట గది, స్టోర్ రూంలను పరిశీలించారు. వంట సరుకుల సరఫరా ఎలా ఉందని ఇబ్బందులు ఉంటే తెలియజేయాలన్నారు. మెనూ ప్రకారం అల్పాహారం వండేందుకు అవసరమైన వంట పాత్రల కొరత ఉంటే జిల్లా వ్యాప్తంగా అన్ని ఎస్సీ హాస్టల్లను పరిశీలించి వాటి కొనుగోలుకు ప్రతిపాదనలు పంపాలని జిల్లా ఇంచార్జి ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి హామీద్‌ను ఆదేశించారు. మెనూ ప్రకారం అల్పాహారం, భోజనంతో పాటు స్నాక్స్ ఖచ్చితంగా అందించాలన్నారు. బాత్‌రూంలకు సరిగా డోర్స్ లేకపోవడంతో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ మాధవిపై ఆగ్రహం వ్యక్తం చేసి బాలికల హాస్టళ్లలో భద్రతకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వెంటనే కొత్త డోర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట సరిత, ఎంపిడిఓ లక్ష్మప్ప తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మను చౌదరి

**అయిల్ ఫాం ఫ్యాక్టరీ పనులు త్వరగా పూర్తిచేయాలి**

**నంగునూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** మండల పరిధిలోని నర్మెటలో నిర్మాణం జరుగుతున్న ఆయిల్ ఫాం ఫ్యాక్టరీని గురువారం జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి సందర్శించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీలో జరుగుతున్న నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత పని జరిగింది? ఎప్పటిలోగా పనులు పూర్తిచేస్తారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫ్రెష్ ఫ్రూట్ బంచెస్ ప్రాసెసింగ్ షీడ్స్, బాయిలర్‌లు మే నెలలోగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. పవర్ ప్లాంట్ జూన్ మొదటి వారం వరకు అన్ని సివిల్, మెకానికల్ పనులు పూర్తి చేయాలన్నారు. జూన్ మొదటి వారంలోగా ఫ్యాక్టరీ పనులు పూర్తిచేసి రైతులకు అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో అయిల్‌ఫెడ్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా హార్టికల్చర్, సెరికల్చర్ అధికారి సువర్ణ, తహసీల్దార్ సరిత, ఎంపిడిఓ లక్ష్మప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలి

### మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

**మెదక్ రూరల్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేసి, పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీస్‌సిబ్బంది నిర్వహిస్తున్న విధులను ఎస్‌ఐ మురళి ఆయనకు వివరించారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అక్కడి అధికారులకు పలు సూచనలు చేస్తూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని కలిగించాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించే సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, సీసీ కెమెరాలు, సిబ్బంది పనితీరును పరిశీలించడంతో పాటు పెండింగ్‌లో తీవ్రమైన నేరాల సీడీ ఫైల్స్, స్థిరాస్తి చోరీలు, ఐటీ కేసుల ప్రస్తుత స్థితిగతులపై రికార్డులను తనిఖీ చేశారు. అలాగే పోలీస్ స్టేషన్ పరిధిలో గల నేర ప్రవృత్తి కల వారిని ప్రతి రోజు తనిఖీ చేయాలని, అలాగే ఆస్తి నేరాలకు పాల్పడే వారిపై నిఘా పెట్టాలని, పోలీస్ స్టేషన్ల పరిధిలో తిరిగే అనుమానితుల సమాచారాన్ని సేకరించాలని, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, కష్టంలో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు పోలీసులు స్వాంతన చేకూర్చాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ వారి ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే ప్రజలు వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియామాలు పాటించాలని, తాగి వాహనాలు నడపవద్దన్నారు. అలాగే బ్లూకోట్స్, పెట్రోకార్స్ నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, డయల్ 100కాల్స్ వచ్చిన వెంటనే తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేయాలని స్టేషన్ అధికారులు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.





పోలీస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



మంత్రి దామోదర్‌కు తిరుపతి లడ్డూను అందచేస్తున్న అందోలు కృష్ణ

## మంత్రి దామోదర్‌కు తిరుపతి లడ్డూ అందజేత

**చౌటకూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి. దామోదర్‌ను మండల పరిధిలోని చిక్రియాల్ గ్రామ మాజీ సర్పంచ్, సర్పంచుల ఐక్యవేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు అందోలు కృష్ణ హైదరాబాద్‌లోని బంజారా హిల్స్‌లో గల మంత్రుల నివాస ప్రాంగణంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తిరుమల తిరుపతి దర్శనం చేసుకుని ప్రసాదం లడ్డును కృష్ణ మంత్రికి అందచేశారు. ఎస్సీల ఎబీసిడి వర్గాకరణకు అవిరళ కృషి చేసినందుకు మంత్రి దామోదర్‌కు కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. చిక్రియాల్ గ్రామాభివృద్ధిని మరిన్ని నిధులు మంజూరు చేయాలని కృష్ణ మంత్రి దామోదర్‌కు వినతి చేశారు.

## విద్యుత్ ఉద్యోగుల ముందస్తు అరెస్టు

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 20,ప్రభాతవార్త:** విద్యుత్ ఉద్యోగులను చిన్నశంకరంపేట పోలిసులు గురువారం నాడు ముందస్తు అరెస్టు చేశారు. విద్యుత్ ఉద్యోగులను కన్వర్షన్ చేయాలన్న పిలుపుతో ఆర్టిజన్ ఉద్యోగులు ఛలో హైదరబాద్ విద్యుత్ సౌద ముట్టడికి పిలుపునిచ్చారు. యూనియన్ నాయకుల పిలుపుమేరకు ఛలో విద్యుత్ సౌద ముట్టడికి వెళ్లకుండా మండల వ్యాప్తంగి విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారు మాట్లాడుతూ తమను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని అన్నారు. అరెస్ట్ అయన వారిలో క్రిష్ణ గౌడ్, రాగిపల్లి రమేష్ గౌడ్, యాదగిరిలు ఉన్నారు.



పోలీసులు అరెస్ట్ చేసిన విద్యుత్ ఉద్యోగులు

## నర్సాపూర్‌లో 4వ రోజుకు చేరిన రిలేనిరహార దీక్షలు

**నర్సాపూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** డంపింగ్‌యార్డు ఎత్తేయాలని రిలే నిరహార దీక్షలు చేపట్టి డంపుయార్డు హటావో నర్సాపూర్‌కు బచావో అన్న నినాదంతో బస్టాండ్‌లో జేఏసీ నాయకులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు గురువారంతో నాలుగవ రోజుకు చేరుకున్నాయి నర్సాపూర్ అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసే డంపు యార్డును ఎత్తివేయాలని మాజీ ఎంపీటీసీ సత్యంగౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బల్దియా ఉపాధ్యక్షులు నయీం ఉద్దీన్ మాట్లాడుతూ నర్సాపూర్ అటవీ ప్రాంతంలో డంపు యార్డు ఏర్పాటు చేయడం వల్ల నర్సాపూర్ అడవితో పాటు చుట్టు పక్కల 24 గ్రామాల చెరువులలోని నీరు కలుషితమవుతాయని అన్నారు

ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పంబల్ల బిక్షపతి,బాల్ రెడ్డి,మొహమ్మద్ ,షేక్ హుస్సేన్, రాంచెందర్, జనార్ధన్‌గౌడ్, కదారి నాగరాజు, చంద్ర శేఖర్, రాధాకిషన్ గౌడ్, సమీయోద్దీన్, బాబు, మున్ను, దుర్గేశ్, వినయ్, సద్దాం, మొహిస్ ఉన్నారు

## లోవోల్టేజీతో కాలిపోతున్న వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు

### రాత్రికిరాత్రే పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల తరలింపు... ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆందోళన తప్పదంటున్న రైతులు

**కౌడిపల్లి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** వినియోగదార్లకు నాణ్యమైన కరెంట్ సరఫరా చేసే సబ్ స్టేషన్‌గా పేరుగాంచిన 132/33 కెవి కౌడిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11 కెవిఎ సబ్ స్టేషన్లు ఎలాంటి లో–ఓల్టేజ్ సమస్యలు లేకుండా సజావుగా కొనసాగుతున్న తరుణంలో విద్యుత్తు అధికారులు 25 రోజుల క్రితం గుట్టుచప్పుడు కాకుండా పారిశ్రామికవాడకు లో ఓల్టేజ్ కరెంట్ సమస్యల సాకుతో సదాశివపేట పారిశ్రామిక వాడకు 50 ఎంవిఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించడంతో రాజీపేట 33/11 కెవిఎ సబ్ స్టేషన్ పరిధిలోని రైతుల పాలిట శాపంగా మారింది. వివరాల ప్రకారం కౌడిపల్లి 132/33 కెవి సబ్ స్టేషన్‌లో రెండు 50 ఎంవిఎ పవర్ ట్రాన్స్‌పార్మర్లు ఉండి కరెంట్‌లో ఓల్టేజ్ సమస్యలు లేకుండా సజావుగా కొనసాగుతుంది. కాగా 25 రోజుల క్రితం సదాశివపేట పారిశ్రామికవాడలో పరిశ్రమలకు లోఓల్టేజ్ సమస్య కారణంగా కరెంట్ కోతలు విధించడం జరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏలాంటి అనుమతులు లేకుండా వ్యవసాయానికి, పరిశ్రమలకు కరెంట్ కోతలు లేకుండా నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేయాలని, అందుకు భిన్నంగా వ్యవహరించిన అధికారిపై వేటు తప్పదని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసిన విషయం విధితమే. కాగా సదాశివపేట పారిశ్రామిక వాడ లో ఓల్టేజ్ కరెంట్ సమస్యను పరిష్కరించుటకు గాను 50 ఎంవిఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ అవసరం ఉంది, అదే సమయంలో కౌడిపల్లి 132/33 కెవి సబ్‌స్టేషన్‌లో పవర్ లోడింగ్ వాడకం తక్కువగా ఉన్నందున ఇక్కడి నుండి 50 ఎంవిఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను 25 రోజుల క్రితం రాత్రిరాత్రికి తరలించి, దాని స్థానంలో వారం రోజుల తర్వాత 10/15 ఎంవిఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించడం జరిగింది. ఈ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మూలంగా కౌడిపల్లిలో లో ఓల్టేజ్ సమస్య రాగా వెంటనే రాజీపేట 33/11 కెవిఎ సబ్‌స్టేషన్‌కు కరెంట్ సరఫరా నిలిపివేసి, నర్సాపూర్ 132/33 కెవి సబ్ స్టేషన్ నుండి కరెంట్ సరఫరా చేశారు. ఇక్కడి నుండి రాజీపేట సబ్‌స్టేషన్ పరిదిలో ఉన్న గ్రామాల వ్యవసాయ బోర్లకు కరెంట్ కష్టాలు మొదలైనాయి. రాజీపేట సబ్‌స్టేషన్‌నుండి రాజీపేట, ముస్రాజ్‌పల్లి, వెంకటాపురం ఆర్,తిమ్మాపూర్, జాజితండా పంచాయతీల పరిధిలోని వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు లో ఓల్టేజ్ కారణంగా మూడు రోజులకు ఒక్క ట్రాన్స్‌పార్మర్ కాలిపోతున్నట్లు రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నర్సాపూర్ సబ్ స్టేషన్‌లో పనిచేసే ఆపరేటర్లు చిన్న సబ్‌స్టేషన్ల లోడింగ్‌ను గ్రహించి, లోడ్ డైవర్షన్ చేయాల్సి ఉండగా ఆపరేటర్లు సైతం రైతుల పాలిట నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నట్లు అద్దంపడుతుంది. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి,వెంటనే కౌడిపల్లి 132/33 కెవి సబ్ స్టేషన్‌లో తిరిగి 50 ఎంవిఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ బిగించి లోఓల్టేజ్ సమస్య లేకుండా చూడాలని, లేని పక్షంలో స్థానిక ఎమ్మెల్యే సునీతా రెడ్డి ఆధ్వర్యంలో రైతులతో పెద్ద ఎత్తున ఆందోళనచేయకతప్పదని చెపుతున్నారు.



రవాణా శాఖ మంత్రిని కలిసిన మాజీ ఎంపిటిసి రవీందర్

## మంత్రిని కలిసిన మాజీ ఎంపిటిసి

**మనూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఎంపిటిసి ఫోరం మాజీ మండల అధ్యక్షుడు రవీందర్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. హైదరాబాద్‌లోని మంత్రులు నివాసంలో రవీందర్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించారు.

### పురుగుల మందు డబ్బా ఇవ్వండి..తాగి సస్తాం అంటూ

## భూ బాధిత రైతుల ఆందోళన



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న భూ బాధితులు

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** మనిషికో పురుగుల మందు డబ్బా ఇవ్వండి ఇక్కడే తాగి సస్తాం అంటూ సిద్దిపేట హై వే రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట జనగామ ఎక్స్ రోడ్డు నుంచి సిరిసిల్ల వరకు నిర్మించ తలపెట్టిన స్పెషల్ హైవే రోడ్డు పనులను నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ 9 గ్రామాల రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ హై రోడ్డులో భూములు కోల్పోతున్న బాధితుల్లో అందరూ సన్న, సన్నకారు రైతులే ఉన్నారని తెలిపారు. రెండు పంటలు పండే పట్టా భూమిని కోల్పోవల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న అద్దెకరం, పావు ఎకరం హై వే రోడ్డులో కోల్పోతే తాము ఎలా బతకాలని ప్రశ్నించారు. హైవే రోడ్డు నిర్మాణానికి భూములు ఇచ్చే ప్రసక్తి లేదని తెలిపారు. అధికారులు పోలీసుల చేత భయపెడుతున్నారని తాము చచ్చిన తర్వాత రోడ్డు వేసుకోవాలని సూచించారు. గ్రీన్ ఫీల్డ్ రహదారికిని 150 ఫీట్ల వెడల్పుతో నిర్మించడానికి రూట్ మ్యాప్‌ను జాతీయ రహదారుల నిబంధనలకు విరుద్ధంగా ఆలైన్మెంట్‌ను తయారు చేశారని తెలిపారు. ఆందోళనలలో పుల్లూరు, చిన్నగుండవెల్లి, బూరుగుపల్లి, దుద్దెడ, ఎన్సాన్‌పల్లి, ఖమ్మంపల్లి, తడకపల్లి, తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు. అనంతరం పలుడిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీకు అందజేశారు.

## ఇసుక ఫిల్టర్‌పై అధికారుల దాడి



ఇసుక ఫిల్టర్‌లపై దాడులు నిర్వహిస్తున్న అధికారులు

**కంది, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బ్యాతోల్ గ్రామ శివారులోని నక్కవాగు పరిసరాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక ఫిల్టర్ పై తమసీల్దార్,పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. అక్రమంగా ఇసుకను తరలించేందుకు సిద్ధంగా ఉన్న హిటాచి, 2 ట్రాక్టర్‌లను, మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.



సంఘటన స్థలంలో మృతి చెందిన గొర్రెలు

## గుర్తు తెలియని కారు ఢీకొని 10 గొర్రెలు మృతి

**కొల్చారం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** గుర్తు తెలియని కారు ఢీకొని 10 గొర్రెలు మృతి చెందిన సంగటన కొల్చారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి గ్రామ శివారులో నాగరాజు గౌడ్ కోళ్ల ఫారం ముందు ఎన్‌హెచ్–765డీ ప్రధాన రహదారిపై గురువారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ పట్టణంలోని దయారాకు చెందిన వెంకయ్య, తన బంధువైన కురుమ శ్రీశైలంతో కలిసి గురువారం ఉదయం 12:30 గంటల సమయంలో తన గొర్రెలను చిన్న ఘనపూర్ వైపు నుండి మెదక్ వైపు కొట్టుకొని వెళ్తుండగా అదే సమయంలో వారి వెనకాల హైదరాబాద్ వైపు నుండి వస్తున్న ఏదో గుర్తు తెలియని కారు అతి వేగంగా, అజాగ్రత్తగా వచ్చి వెనుక నుండి వెంకయ్యను ఢీకొని, గొర్రెల పైకి వెళ్లి గొర్రెలను ఢీకొనడంతో 10 గొర్రెలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. వెంకయ్యకు గాయాలయ్యాయి. మరికొన్ని గొర్రెలకు గాయాలయ్యాయి. బాధితుడి మేనమామ మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కొల్చారం ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు.

## అదుపు తప్పిన లారీ-తప్పిన ప్రమాదం

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** చెరుకు లోడ్‌తో వెళుతున్న లారీ అదుపు తప్పిన సంఘటన పట్టణ పరిధిలోని మంగల్‌పూటలో చోటు చేసుకుంది. చెరుకు లోడ్‌తో నిజాంసాగర్ చెక్కర కర్మాగారానికి వెళుతున్న క్రమంలో మంగల్‌పేట దుర్గమ్మ ఆలయం వద్ద లారీ నుంచి చెరుకు గడలు కింద పడటం ప్రారంభం అయ్యాయి. అటుగా ఎలాంటి వాహనాలు, ప్రజలు ప్రయాణం చేసేవారు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని చెప్పవచ్చు.



అదుపుతప్పిన చెరుకులోడ్ లారీ

## మతతత్వ, నిరంకుశవాద శక్తులను తరిమికొట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఈ.టి.నర్సింహ్మా

**సైఫాబాద్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** మతతత్వం, నిరంకుశవాద శక్తులు ప్రాతినిధ్యం వహిస్తున్న మితవాద దాడిని తిప్పికొట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈ.టి.నరి ్సంహ్మా పిలు పునిచ్చారు. ఈ శక్తులను సమర్థవంతంగా ఎదుర్కొనడానికి పార్టీని మరింతగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు గురువారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగ రక్షణకై నవ-ఉదారవాద విధానాలు,మతతత్వం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడటానికి ప్రజలను సమీకరించవలసిన అవసరం ఉందన్నారు. దీనికోసం ప్రజా మార్గాన్ని స్వీకరించి ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు ఏర్పరుచుకుని, ప్రజా ఉద్యమాలను అభివృద్ధి చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, నాయకులు చందునాయక్, స్టాలిన్, నెర్లకంటి శ్రీకాంత్, కంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నిదానాలల్లో కెల్లా విద్యాదానమే గొప్పది : రంగారావు


సరస్వతి విద్యామందిర్‌లో చదువుతున్న పేద విద్యార్థులకు ఫీజును అందిస్తున్న వడ్డేపల్లి రంగారావు

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**

నిరుపేదల విద్యార్థులకు విద్యాదానం చేయటం ద్వారా ఆత్మ సంతృప్తి కలుగుతుందని వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ వైస్ ఛైర్మన్ వడ్డేపల్లి రంగారావు అన్నారు. చందానగర్‌లోని సరస్వతీ విద్యామందిర్‌లో చదువుతూ.. ఆర్థికంగా వెనుకబడి ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న నలుగురు విద్యార్థులకు వడ్డేపల్లి రంగారావు ఫీజుల వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు ఉన్నత చదువులు చదివించుకునే స్తోమతలేని వారికి తమవంతు ఇతోదిక సహాయం చేయటం బాధ్యతగా బావిస్తున్నామన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా సరస్వతి విద్యామందిర్ పాఠశాలలో నిరుపేదలకు విద్యా బుద్ధులు అందించటం గొప్పవిషయమన్నారు. విద్యార్థులకు చిన్ననాటి నుంచే చదువుతో పాటు సంస్కారం, సంస్కృతి నేర్పిస్తున్న సరస్వతి విద్యామందిర్ పాఠశాలకు తనవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నరేంద్రప్రసాద్,స్కూల్ జాయింట్ శెక్రటరీ రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ పటిష్టతకు కృషి చేయండి

**-ఎఐసిసి సభ్యురాలు డా.కోట నీలిమ**


సింధీ కాలనీ సిల్వర్ జుబ్లీ అపార్ట్‌మెంట్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న కోట నీలిమ.

**బేగంపేట ఫిబ్రవరి 20,ప్రభాతవార్త**

ప్రతి కార్యకర్త,నాయకులు చేయి చేయి కలిపి కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి,ఏఐసీసీ సభ్యురాలు డా.కోట నీలిమ అన్నారు .గురువారం సనత్‌నగర్ నియోజకవర్గం సింధి కాలనీలోని సిల్వర్ జూబ్లీ అపార్ట్‌మెంట్‌లో కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమీక్షా సమావేశం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నా డా.కోట నీలిమ మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం చేపట్టాక ఎన్నో సంక్షేమ పథకాలను అమలులోకి తీసుకువచ్చిందన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒకటొకటిగా అమలు చేస్తుందన్నారు.అలాగే ప్రతి బూత్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఆమె పిలుపు నిచ్చారు. కష్టపడి పార్టీ అభివృద్ధికి పనిచేసే కార్యకర్తలను తగిన విధంగా పార్టీ సత్కరిస్తుందన్నారు.రానున్న కమిటీలలో కష్ట పడి పనిచేసే కార్యకర్తలకు మొదటి ప్రాధాన్యత దక్కనుందన్నారు.సనత్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ ఎంతో బలంగా ఉందన్నారు.రానున్న రోజుల్లో ప్రతి ఒక్క డివిజన్‌లోని సమస్యలను గుర్తించి ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు చేపట్టేలా చూస్తామని కోట నీలిమ అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు విశాల్ సుధాం,గౌరపల్లి రమేష్,దర్ప కరుణాకర్,హనీఫ్,చిరంజీవి,మునీర్,కృష్ణ,జగదీష్,శేఖర్,మనోజ్, పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

## బస్తీ దవాఖానాల్లో డిఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

**-సిబ్బంది పనివేళలు పాటించాలని ఆదేశం**


బస్తీదవాఖానాల్లో సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి

**హైదరాబాద్,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త:**

జిల్లాలోని అన్ని బస్తీ దవాఖానాలు నిర్ణీత పనివేళలు పాటించి రోగులకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి సంబంధిత వైద్యులకు సూచించారు. ఈమేరకు గురువారం జిల్లాలోని పలు బస్తీ దవాఖానాల్లో పర్యటించి అక్కడ అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, చికిత్సలు , వసతులు, మందులునిల్వలు పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్, సిబ్బంది నిర్వహిస్తున్న రికార్డులనూ పరిశీలించి అందించిన సేవలు ఎప్పటికప్పుడు రికార్డులల్లో నమోదు చేయాలన్నారు. అలాగే బస్తీ దవాఖానా ప్రాంతాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి,పారి శుధ్యం మెరుగు పరచాలని సూచించారు.

## సమాజాన్ని చైతన్యం చేయటంలో కవుల పాత్రకీలకం : జగదీశ్వర్‌గౌడ్


జగదీశ్వర్‌గౌడ్ చేతుల మీదుగా కవితాసంపుటి అవిష్కరణ

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**

సమాజాన్ని చైతన్యచేయటంలో కవులు, కళాకారుల పాత్ర కీలకమైనదని శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శేరిలింగంపల్లి రచయితల సంఘం గౌరవ అధ్యక్షులు ట్యాగ్‌లైన్ కింగ్ డాక్టర్ ఆలపాటి ఆధ్వర్యంలో శేరసం ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమం,కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. సమాజాన్ని నిత్యం చైతన్యవంతం చేయటానికి కవులు, కళాకారుల రచనలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. తెలంగాణ రాష్రట సాధనలో కూడా కవులు, కళాకారుల పాత్ర గొప్పదని ఆయన గుర్తుచేశారు. ఒక అక్షరం లక్ష మెదళ్ల కదలికయని ప్రజాకవి కాళోజీ అన్న మాటలు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కదిలేది, కదిలించేది కవిత్వమని ఆయన అన్నారు. శేరిలింగంపల్లి నియోజక వర్గంలో ఉన్న కవులు, కళాకారులకు తమవంతు సహాయ,సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాలలో భాగంగా కవిశ్రీ సత్తిబాబు రచించిన ప్రయాణం బాల్యం నుంచి అనే కవితా సంపుటిని జగదీశ్వర్‌గౌడ్ చేతుల మీదుగా అవిష్కరించారు. శేరిలింగంపల్లి రచయితల సంఘం ఉపాధ్యక్షుడు జేవీ కుమార్ చేపూరి తొలిపలుకులతో సభ ప్రారంభం కాగా ప్రముఖ కవి,రచయిత వసీరా కవితా సంపుటిని సమీక్షించారు. శేరిలింగంపల్లి రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ మోటూరి నారాయణరావు సమయన్వయంతో ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవీంద్రబాబు అరవా నిర్వాహణలో కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కవి సమ్మేళనంలో శేరిలింగంపల్లి కవులు పావనేవ్వరి నిమ్మగడ్డ,సుమచంద్ర,కొలచన విజయభారతి, సిహెచ్ ఉషారాణి, రావినూతన జగదీశ్వరి, డాక్టర్ రమ్య స్వరూప్, ముడుంబై మంజులరాణి, మల్కని విజయలక్ష్మీ,చంద్రప్రకాశ్ గుప్త, విశ్వనాథరెడ్డి,గూండ్ల నారాయణ, మాచవోలు శ్రీధర్‌రావు, భమిడిపాటి వెంకటేశ్వర రావు,డాక్టర్‌గోగు వెంకటేశ వ్యర్లు, ఎంవీ చంద్రశేఖర్‌రావు, కవిశ్రీసత్తిబాబులు హజరై తమ కవిత్వాన్ని వినిపించారు.శేరసం కోశాధికారి భీమా శ్రీనివాస్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు యం.రఘునందన్‌రెడ్డి,ఉరిటి వెంకట్రావు,ప్రభాకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్ హామీతో సమ్మె తాత్కాలిక విరమణ : ఎఐటియుసి నేత నర్సింహ్మా


కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎం.నర్సింహ్మా, రామాంజనేయులు

**సైఫాబాద్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** రెండోవ ఎఎన్ఎంల సమస్యలు పరిష్కారానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఇచ్చినహామీతో తాత్కాలికంగా సమ్మెను విరమించుకోవడం జరిగిందని ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.నర్సింహ్మా తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రెండోవ ఎఎన్ఎంల యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌తో గురువారం జరిగిన చర్చల్లో వారి సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో సమ్మెను తాత్కాలికంగా విరమణ చేశామని ఆయన తెలిపారు. కోఠిలోని కమిషనర్ కార్యాలయంలో జరిగిన చర్చల్లో ఎఎన్ఎంల పోస్టుల పెంపు, పిహెచ్సిలలో ఓపిఎఎన్ఎం, అర్బన్ పిహెచ్సిలలో రెగ్యులర్, ఎఎన్ఎం పోస్టులను మంజూరుపైన, పరీక్ష రాయడానికి అర్హత లేని ఎఎన్ఎంలకు రిటైర్‌మెంట్ అయిన తరువాత బెనిఫిట్, 100 శాతం గ్రాస్ శాలరీని అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న 7 నెలల పిఆర్సీ బకాయిలను, సబ్ సెంటర్ బకాయిలను మార్చి 31వ తేదీలోగా చెల్లిస్తామని కమీషనర్ హామీ ఇచ్చారని నర్సింహ్మా చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రెండోవ ఎఎన్ఎంల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తోట రామాంజనేయులు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జక్కుల పద్మ, బోయిని శ్యామల, ఉపాధ్యక్షులు తస్వీనర్ సుల్తానా, రత్నకుమారి, జయమ్మ, గిరిజారెడ్డి, గీతారాణి, పార్వతి, సంధ్యారాణి, గోపమ్మ, గోపమ్మ, కృష్ణవేణి, శైలజ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. తొలుత వారు కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

## ఒ.యూ అకడమిక్..శిక్షణ భాగస్వామ్యం కోసం ఎసిసిఎతో చర్చలు


ఎసిసిఎ బృందంతో ఒ.యూ ఉపకులపతి ప్రొ.కుమార్ మొలుగరం, రిజిస్ట్రార్ ప్రొ. నరేష్ రెడ్డి

**తార్నాక, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :**

ఉస్మానియా యూనివర్శిటీ తో అకడమిక్, శిక్షణ భాగస్వామ్యం కోసం ఆస్ట్రేలియా సర్టిఫైడ్ అకౌంటెంట్స్ (ఏసీసీఏ) చర్చలు.ఆస్ట్రేలియా సర్టిఫైడ్ ఛార్టెడ్ అకౌంటెంట్స్ (ఏసీసీఏ) ప్రతినిధి బృందం ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం, రిజిస్ట్రార్ ఆచార్య నరేష్ రెడ్డితో పాటు కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ అధ్యాపకులతో భేటి అయ్యారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంతో కలిసి పనిచేయటంతో పాటు పలు రంగాల్లో పరస్పర అవగాహన ఒప్పందం కోసం ఉన్న అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉస్మానియా ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలతో శిక్షణ ఇచ్చేందుకు ప్రపంచస్థాయి సంస్థలతో భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. పరిశ్రమ, అకడమిక్ మధ్య ఉన్న గ్యాప్ ను పూడ్చేందుకు ఇలాంటి చర్చలు అవసరమని... ఆస్ట్రేలియా సర్టిఫైడ్ చార్టెడ్ అకౌంటెంట్స్ .. ఏసీసీఏ తో మరిన్ని విస్తృత చర్చలు జరుపుతామని పరస్పరం భాగస్వామ్యంతో కలిసి పనిచేద్దామని అన్నారు. ఉస్మానియా లాంటి ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయంతో కలిసిపనిచేసేందుకు తాము ఉత్సాహంగా ఉన్నామని భారతీయ వ్యవహారాల డైరెక్టర్ మోహమ్మద్ సాజిద్ ఖాన్ తెలిపారు.ఈ సమావేశంలో ఏసీసీఏ ప్రతినిధులుగా మోహమ్మద్ సాజిద్ ఖాన్, డైరెక్టర్ - ఇండియా, మిస్టర్ ప్రభాంషు మిట్టల్, హెడ్ ఆఫ్ ఎడ్యుకేషన్ పార్టనర్ రిలేషన్‌షిప్స్, మిసెస్ ఆల్థియా లీ, ఎడ్యుకేషన్ పార్టనర్ రిలేషన్‌షిప్స్ లీడ్ (సౌత్), మిస్టర్ రోయిస్టన్ ఎబెన్నేజర్, బిజినెస్ రిలేషన్‌షిప్స్ మేనేజర్ పాల్గొన్నారు.ఉస్మానియా యూనివర్శిటీ నుంచి ప్రొఫెసర్ కే. కృష్ణ చైతన్య, డీన్, ఫాకల్టీ ఆఫ్ కామర్స్, ప్రొఫెసర్ ఎం. గంగాధర్, హెడ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్, ప్రొఫెసర్ ఎ. ప్యాట్రిక్, ఛైర్మన్, బోర్డ్ ఆఫ్ స్టడీస్, ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్, ప్రిన్సిపల్, యూనివర్శిటీ కళాశాల ఆఫ్ కామర్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ప్రొఫెసర్ సి. వీ. రంజని, ప్రొఫెసర్ ఎస్. కవితా దేవి, డాక్టర్ బి. సంధ్యా ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

## వైద్య వృత్తిలో అత్యాధునిక విధానం అవసరం

**-సూపరింటెండెంట్ రాజ్‌కుమారి**


కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ రాజ్‌కుమారి తదితరులు

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కళాశాలలోని రీజినల్ ట్రైనింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బేసిక్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్ శిక్షణ కార్యక్రమాన్ని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి కళాశాల ప్రిన్సిపాల్ డా.ఇందిరతో కలిసి ప్రారంభించారు. ఈ సదర్భంగా ఆమే మాట్లాడుతూ వైద్య విద్యలో ప్రపంచవ్యాప్తంగా అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. వైద్య విద్య బోధనలో ఆధునిక పద్ధతులను పాటించాలని, అందుకోసం అధ్యాపకులు కూడా తగిన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు తెలంగాణలోని 60 మెడికల్ కళాశాలలను మూడు రీజియన్లుగా విభజించారని, గాంధీ మెడికల్ కళాశాల కూడా ఒక రీజనల్ కేంద్రంగా ఉన్నదని తెలిపారు. తమ పరిధిలో ఉన్న 25 వైద్య కళాశాలకు చెందిన ప్రిన్సిపాల్స్, అధ్యాపకులతో తాము ఈ శిక్షణ ఏర్పాటు చేశామని వివరించారు. వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు మార్కులు మాత్రమే కాకుండా వారి కమ్యూనికేషన్స్ కూడా మెరుగుపర్చుకోవాలని, ఇందుకోసం నూతన బోధన పద్ధతులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సుబోధ్ కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కే.రవి శేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు వర్సిటీ యువపురస్కారానికి ఆహ్వానం

**నిజాంపేట్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, రంగస్థల కళలశాఖ ప్రతి సంవత్సరం మార్చి, 27న ప్రపంచ రంగస్థల దినోత్సవం జరుపుకుంటుంది. దానిలో భాగంగా జె.ఎల్.నర్సింహారావు పేరు మీద యువ పురస్కార ప్రదానోత్సవం జరుగుతుంది. నాటక రంగంలో వివిధ రంగాలలో అంటే నటన, దర్శకత్వం, మేకప్, లైటింగ్, సెట్ ఇంకా ఇతర సాంకేతిక అంశాల్లో కృషి చేసిన 35 సంవత్సరాల లోపు యువతి, యువకులు ఈ పురస్కారానికి దరఖాస్తు చేసుకోవచ్చును. రిజిస్ట్రార్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, బాచుపల్లి వారికి పోస్టు ద్వారా కాని స్వయంగా కానీ సంబంధిత వివరాలతో దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేది. 10.3.2025గా తెలియజేయడమైనది.

## ఢిల్లీ సిఎంగా రేఖాగుప్తా బాధ్యతలు చేపట్టడం గర్వకారణం

**-ఆర్యవైశ్య మహాసభ జాతీయ సలహాదారులు కొటికె విఠల్**

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** ఢిల్లీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ సభ్యురాలైన రేఖాగుప్తా బాధ్యతలను స్వీకరించడం గర్వకారణంగా ఉందని ఆర్యవైశ్య మహాసభ జాతీయ సలహాదారులు కొటికె విఠల్ అన్నారు. న్యాయశాస్త్రంలో పట్టభద్రురాలైన ఆమె, విద్యార్థి నాయకురాలిగా, లేడీటౌగర్‌గా ఎంతో పేరును సంపాదించారన్నారు.వైశ్య జాతికే వన్నె తెచ్చిన మహా నాయకురాలు రేఖాగుప్తా అని పేర్కొన్నారు. సంఘ్ మహిళా సంబంధిత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారని, ప్రస్తుతం బిజెపి మహిళామోర్చ జాతీయ ఉపాధ్యక్షురాలిగా, పార్టీ జాతీయ కార్యవర్గసభ్యురాలిగా ఉన్నారన్నారు. బిజెపి నుంచి సుష్మాస్వరాజ్, ఉమాభారతి, వసుంధర రాజే, అనందీబెన్ పటేల్‌ల తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టిన ఐదవ మహిళగా, దేశంలో విభిన్న పార్టీల నుంచి సిఎం పదవిని చేపట్టిన 18వ మహిళగా రేఖాగుప్తా పేరును సంపాదించారన్నారు.

## ఎన్ఆర్ఇజిఎస్ అమలు, అవకాశాలుపై సెమినార్



**అత్తాపూర్ ఫిబ్రవరి20,ప్రభాతవార్త :**

రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్‌డి, పిఆర్‌లో "మహాత్మా గాంధీ ఎన్ఆర్ఇజిఎస్ అమలు, అవకాశాలు సవాళ్లు" అనే అంశంపై రెండు రోజుల సెమినార్ ప్రారంభమైంది. గురువారం ఎన్ఐఆర్డి పిఆర్ ప్రొఫెసర్ డాక్టర్ రవీంద్ర గవాలి,సీనియర్ రీసెర్చ్ ఫెలో డాక్టర్ సుధా నారాయణన్ పలువురు ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జీవనోపాధి, వాతావరణ స్థితిస్థాపకత, డిజిటల్ గవర్నెన్స్, స్కిల్ డెవలప్మెంట్, జెండర్ ఈక్విటీ మరియు ఎస్డిజి (సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్) సహా ఆరు ఇతివృత్తాలపై దేశవ్యాప్తంగా ఉన్న పండితులు మరియు అభ్యాసకులు పత్రాలను సమర్పించి చర్చించారు. అనంతరం ఐఎఫ్పిఆర్ఐకి చెందిన సీనియర్ రీసెర్చ్ ఫెలో డాక్టర్ సుధా నారాయణన్ మాట్లాడుతూ...మహాత్మా గాంధీ ఎన్ఆర్ఇజిఎస్ గతం, వర్తమానం, భవిష్యత్తు గురించి పలు సూచనలు చేశారు.సెమినార్ యొక్క రోడ్డు మ్యాప్‌ను రూపొందించారు.ఈ సమావేశంలో నైరూప్య పుస్తకాన్ని కూడా పలువురు ప్రతినిధులు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ వేజ్ ఎంప్లాయిమెంట్ అండ్ లైవ్లీహుడ్స్ (సిడబ్ల్యుఇఎల్) ఎన్ఐఆర్డి పిఆర్ కు చెందిన డాక్టర్ సోనాల్ మొబర్ రాయ్, డాక్టర్ సి. ధీరజ, డాక్టర్ దిగంబర్ ,ఎ. చిమాంకర్ పాల్గొన్నారు.

# విద్యార్థినులకు స్కాలర్‌షిప్ చెక్కులు పంపిణీ


మలబార్ నేషనల్ స్కాలర్షిప్ ప్రోగ్రాంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద

**జీడిమెట్ల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**

బహదూర్ పల్లిలోని కెఎం.పాండు ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజ్ ఆవరణలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మలబార్ నేషనల్ స్కాలర్షిప్ ప్రోగ్రాం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై 337 మంది విద్యార్థినిలకు ఒక్కొక్కరికి పదివేల రూపాయల చొప్పున 26.72 లక్షల రూపాయల విలువగల స్కాలర్ షిప్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ ప్రపంచాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన సాధనం విద్య అని, ఆడపిల్ల విద్యాభివృద్ధితోనే కుటుంబం ఆర్థిక పరిపుష్టిని సాధిస్తుందని నమ్మి ఆడపిల్లల విద్యకై జాతీయ స్థాయి స్కాలర్ షిప్ కార్యక్రమాన్ని మహిళల సాధికారతకై మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ వారు చేపట్టడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ జోనల్ హెడ్ షణీబ్.కె, కూకట్ పల్లి స్టోర్ మేనేజర్ మహమ్మద్ ఇర్ఫాన్, కె.పి.హెచ్.బి స్టోర్ మేనేజర్ శ్రీనివాస్. కెవెన్, మార్కెటింగ్ హెడ్ రాకేష్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జాయిన్ సెక్రెటరీ డాక్టర్ ఆర్. జోత్స్న రాణి, కుత్బుల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మ, ఒకేషనల్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ షేక్ మైమూన్, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ నాగేంద్రరావు, కూకట్పల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ వెంకటయ్య, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ ఛైర్మన్ మన్నె రాజు, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ నాగరాజు యాదవ్, దుండిగల్ మాజీ కౌన్సిలర్లు నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, మల్లేష్, సీనియర్ నాయకులు సగ్గిడి శ్రీనివాస్, మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు శ్రీకాంత్, మైసిగారి శ్రావణ్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు చేనేతవస్త్రాలు ధరించాలి

**-కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**


ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, చిత్రంలో తమిళనాడు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఆర్.గాంధీ తదితరులున్నారు.

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు వారంలో ఒకరోజు చేనేతవస్త్రాలు ధరించాలని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి అన్నారు. దేశంలో వ్యవసాయ రంగం తరువాత అత్యధిక కార్మికులు పనిచేస్తున్న రంగం ఏదైనా ఉందంటే అది చేనేత రంగమని ఆయన చెప్పారు. దేశంలో వస్త్ర పరిశ్రమకు తమిళనాడు రాష్ట్రం విశేషంగా ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. గురువారం ఆర్టీసి క్రాస్ రోడ్డులో నూతనంగా ఆధునీకరించిన కోఆప్టెక్స్ ఫోరూమ్‌ను తమిళనాడు రాష్ట్ర మంత్రి ఆర్.గాంధీతో కలిసి ప్రారంభించి ప్రసంగించారు. ప్రతి ఒక్కరు చేనేత వస్త్రాలు వారంలోఒకరోజు ఉపయోగించి సంస్థను అభివృద్ధిపథంలో ముందుకు తీసుకెళ్ళడానికి సహకరించాలని కోరారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేనేతరంగాన్ని తమ ప్రభుత్వం అభివృద్ధి చేయడానికి కట్టుబడి ఉందన్నారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, కోఆప్టెక్స్ మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ జాకబ్, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ చేనేత, జౌళి శాఖ కార్యదర్శి వి.అమృతవల్లి, డైరెక్టర్ మాగేశ్వరి రవికుమార్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చేనేత, జౌళి శాఖ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యర్, గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ కుమార్, స్టోర్ ఇంచార్జ్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 30న "రైజింగ్ తెలంగాణ సిఆర్ఎస్ అవార్డులు


గోడపత్రిక అవిష్కరిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ్మా తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 20,ప్రభాతవార్త:**

విద్య, వైద్యం, వ్యాపారం, స్త్రీ శక్తి రంగాలలో విశిష్ట సేవలు అందించిన వారందరికీ రైజింగ్ తెలంగాణ సిఎస్ఆర్ అవార్డ్సును ఇచ్చి సత్కరించడం ఎంతో విశేషమని ఇప్పటికే నాలుగు పర్యాయాలు వైద్యరత్న అవార్డులను అందించడం ప్రశంసనీయమని తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కొనియాడారు. ఈమేరకు గురువారం జూబ్లీ హిల్స్ లోని కార్యాలయంలో -2025 సంవత్సరానికి రైజింగ్ తెలంగాణ అవార్డ్స్ గోడపత్రికను ఆవిష్కరించారు, ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కరోనా సమయంలో వైద్యుల సేవలు మరువలేనివని, అలాంటి వైద్యులకు ఇలాంటి అవార్డులను అందిచడం అభినందనీయమన్నారు, మాదిరెడ్డి జగన్నాథం మాట్లాడుతూ 2015 నుండి వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారిని ఘనంగా సత్కరించామన్నారు. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియను మొదలు పెట్టమని ఏప్రిల్ 20 వరకు నామినేషన్లను స్వీకరిస్తానన్నారు. అనంతరం ఏప్రిల్ 30న అవార్డులను మంత్రి దామోదర రాజనర్సింహ చేతులమీదుగా అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పవన్,ఐకానిక్ శ్రీనివాస్ గౌడ్,,, ఆర్‌పిఏ ఫౌండర్ జనరల్ సెక్రెటరీ కే శివకుమార్,, గ్లోబల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఫౌండర్ కట్ట సునీల్, భాగీ రెడ్డి, గంగాధర్ రెడ్డి, సుధాకర్ యాదవ్, విశ్వతదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు దాటకుండా బ్యారికేడ్లు , కంచె ఏర్పాటు


పోలీస్‌లైన్ వద్ద రోడ్డు దాటకుండా అడ్డుగా బ్యారికేడ్లు ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీసులు.

**బేగంపేట ఫిబ్రవరి 20,ప్రభాతవార్త**

బేగంపేట పోలీసులైన్,శ్యాంలాల్ బిల్డింగ్ వద్ద పలు బస్తీలకు చెందిన విద్యార్థులు,మహిళలు,ప్రజలు రోడ్డు దాటి పాఠశాలకు,బస్టాప్‌లకు చేరుకోవాల్సి ఉంటుంది.అయితే బేగంపేట లో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటుంది.దీంతో బస్తీ వాసులు రోడ్డు దాటే క్రమంలో పలువురు ప్రమాదాలకు గురయ్యారు.ఈ విషయంపై ప్రభాతవార్త హైదరాబాద్ మినీ ,,లో ఈ నెల 7వ తేదీన రోడ్డు దాటాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిందే,,ప్రతి రోజు విద్యార్థులు,మహిళలకు తప్పని ఇక్కట్లు అంటూ కథనం ప్రచురితమైంది.కథనంపై స్పందించిన ట్రాఫిక్ పోలీసులు ఆయా ప్రాంతాల్లో రోడ్డు దాటకుండా ఉండేలా రోడ్డుకు అడ్డుగా బ్యారికేడ్లు,ముళ్ల కంచె ఏర్పాటు చేసారు.దీంతో ప్రజలు రోడ్డు మధ్యలో నుంచి రోడ్డు దాటి ప్రమాదాలకు గురికాకుండా చేసినట్లైంది.బేగంపేట ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ పాపయ్య ఆధ్వర్యంలో ఆ ప్రాంతంలో బ్యానర్ ఏర్పాటు చేసారు.ప్రతి ఒక్కరి ప్రాణం ఎంతో విలువైందని ప్రాణాలు కాపాడుకోవాలంటే సమీపంలో ఉన్న మెట్రో మెట్లెక్కి రోడ్డు దాటాలన్నారు.బేగంపేట లో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుందని,ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలన్నారు.

## బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కాంపస్ మార్ట్

**బేగంపేట ఫిబ్రవరి 20,ప్రభాతవార్త**

విధ్యార్థినులలో ఉద్యమిత్వ నైపుణ్యాలను ,వాణిజ్య దృక్పదాన్ని పెంపొందించాలనే ఉద్దేశ్యంతోనే ఇలాంటి కాంపస్ మార్ట్‌లను కళాశాలలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామని కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ త్రిపురం భాస్కరరెడ్డి అన్నారు. గురువారం బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల లో స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో కాంపస్ మార్ట్ నిర్వహించారు.ఈ సందర్భంగా 55ఫుడ్‌స్టాల్స్,22బిజినెస్ స్టాల్స్ 12గేమ్స్‌స్టాల్స్ లను ఇంచార్జి ప్రిన్సిపాల్ త్రిపురం భాస్కరరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధ్యార్థినులలో ఉన్న ప్రతిభను వెలికి తీయాలంటే ఇలాంటి కాంపస్ మార్ట్‌లు ఎంతో ఉపయోగపడతాయన్నారు.ఈ కాంపస్ మార్ట్‌కు సమన్వయ కర్త గా డాక్టర్ జీ.ఎస్.జ్యోతిర్మయి వ్యవహరించగా సుమారు 3వేల మంది విధ్యార్థినులు ఎంతో ఆసక్తి,ఉత్సాహంతో స్టాల్స్‌ను సందర్శించి కొనుగోలు చేసారు.ఈ కాంపస్ మార్ట్‌లో ఐ క్యూ ఏ సీ కో ఆర్డినేటర్ డా, ఆనీషెరాన్,పరిక్షల నియంత్రణ అధికారి డా.డి.పుష్ప, దినేష్ శుక్లా,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు,వివిధ విభాగాల అధిపతులు,కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిసి అభ్యర్థులను గెలిపిస్తే.. బిసి సీఎం ఖాయం

**-బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్**


డైరీ ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, చిరంజీవులు, శ్రీనివాస్‌రావు తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 20,ప్రభాతవార్త:**

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలే రేపటి భవిష్యత్తులో రాష్ట్ర రాజకీయాలను శాసించనున్నాయని ఈ ఎన్నికల్లో పార్టీలకతీతంగా బీసీ అభ్యర్థులను గెలిపిస్తే రెడ్ల రాజకీయాలకు అడ్డుకట్ట వేసి, రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్టానికి సీఎం కావడం ఖాయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ ఉపాధ్యాయ సంఘం డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి మాజీ ఐఏఎస్, బిసి ఇంటలెక్చువల్ ఫోరం ఛైర్మన్ చిరంజీవులుతో కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఐదు శాతం ఉన్న రెడ్డి సామాజిక వర్గానికి ఉపాధ్యాయ సంఘాలు గెలుపు గుర్రాల పేరుతో రెడ్లకు బిఫామ్ లు ఇచ్చాయని, బీసీలకు మాత్రం టికెట్లు ఇవ్వడానికి నిరాకరించారన్నారు. అందుకే ఈ ఎన్నికలలో రెడ్ల పాలనకు చరమగీతం పాడాలంటే ప్రస్తుతం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో "బీసీల ఓటు బీసీలకే వేసి" రెడ్ల రాజకీయాలకు అడ్డుకట్ట వేయాలని ఉపాధ్యాయులకు శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న మల్క కొమరయ్య, పూలరవీందర్‌లతోపాటు ప్రసన్న హరికృష్ణలకు పార్టీలకు అతీతంగా ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయసంఘం రాష్ట్ర అధ్యక్షులు సుంకర శ్రీనివాస్, కులసంఘాల జేఏసీ ఛైర్మన్ పాల్గొన్నారు.

## లక్ష్మీగణపతి దేవాలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** ఆర్టీసిక్రాస్‌రోడ్స్ లో శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయం ఛైర్మన్ నర్సింగరావు, ఈవో లక్ష్మారెడ్డి వివరించారు. ఈ పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని దేవాలయాలన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దడంతో పాటు నీటితో ఆలయాన్ని శుభ్రం చేసే పనిలో పడ్డారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని 26న ఉదయం ఐదు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ఏకవారరుద్రాభిషేక మహోత్సవాలు, ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నాం ఒంటి గంట వరకు స్వర్ణపుష్పార్చనలు, సాయంత్రం ఆరు గంటలకు ఉమామహేశ్వరస్వామి వారి కళ్యాణ మహోత్సవం కన్నులపండువగా జరుగుతుందన్నారు. అదే రోజు రాత్రి తొమ్మిది గంటల నుంచి మహాన్యాసపూర్వక రుద్రాభిషేక మహోత్సవాలను నిర్వహిస్తామన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీ క్షీరలింగేశ్వరస్వామివారి దర్శించుకుని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## శివాలయంలో మహాశివరాత్రి వేడుకలు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** వివేక్‌నగర్‌లోని పవిత్రమైన శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న శివాలయంలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ పునర్‌నిర్మాణ కమిటీ ఛైర్మన్ సుధాకర్, ఈవో మాచర్ల దేవనాథం వివరించారు. 26న ఉదయం 6 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ఉదయం తొమ్మిదిన్నర నుంచచి మధ్యాహ్నాం ఒకటిన్నర వరకు తిరిగి 4 గంటల నుంచి రాత్రి ఎనిమిదిన్నర గంటల వరకు ఏకవార రుద్రాభిషేక మహోత్సవాలు, రాత్రి 10 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం,రాత్రి 1 గంటకు శివ కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. భక్తులు హాజరై స్వామికృపకు పాత్రులు కావాలని కోరారు.

## బైక్‌ను ఢీకొట్టిన వ్యాన్

**అత్తాపూర్ ఫిబ్రవరి20,ప్రభాతవార్త :**

బైక్‌ను ఓ వ్యాన్ ఢీకొట్టిన సంఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.స్థానికుల వివరాల ప్రకారం... కిస్మత్ పూర్ వద్ద బైక్ ను సిమెంట్ వ్యాన్.ఢీ కొట్టి ఓ వ్యక్తి చెయి పై నుండి దూసుకెళ్లిందని బైకిస్టుకు తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించాడం జరిగిందని మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు.కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

### సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో

## అన్ని వర్గాల ప్రజలకు న్యాయం

**సిద్ధిపేట అర్బన్,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రైవేటు కళాశాలలో పర్యటించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 55 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడం జరిగిందన్నారు. బిజెపిని గెలిపించడానికే బిఆర్ఎస్ చీకటి ఒప్పందం చేసుకొని ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదన్నారు. బిజెపి, బిఆర్ఎస్ నాయకులు ఎన్ని మాయ మాటలు చెప్పినా ప్రజలు నమ్మె పరిస్థితుల్లో లేరన్నారు. కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించి తీరుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 22న సిద్దిపేటలో సభ నిర్వహించడం జరుగుతుందని సభకు మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరవుతారని తెలిపారు.సమావేశంలో నాయకులు పూజల గోపికృష్ణ, యాదగిరి, కలీం, గాయజుద్దీన్, రాజిరెడ్డి, రాజేష్‌ఖన్నా, సాయిప్రతాప్, స్వామి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధాశ్రమాన్ని సందర్శించిన న్యాయమూర్తి



వృద్ధులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వాతిరెడ్డి

**కొండపాక, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం కొండపాకశివారులోని వృద్ధాశ్రమం అనంద నిలయాన్ని సిద్దిపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి స్వాతిరెడ్డి సందర్శించారు. అదే ప్రంగణంలో ఉన్న బాల సదనం సందర్శించి ఆమె మాట్లాడారు. బాలలకు చట్టం కల్పించిన హక్కులను వాటి పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. బాలురకు పలు సూచనలు సలహాలను ఇచ్చారు. కార్యక్రమాల్లో వృద్ధాశ్రమం డైరెక్టర్‌లు వైకుంఠం, గట్టు రవి,న్యాయవాది, లీగలైయిడ్ కౌన్సిలర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

### రాయవరం పాఠశాలను సందర్శించిన ఎంఇవో



విద్యార్థుల వర్క్ బుక్‌లను పరిశీలిస్తున్న ఎంఈఓ సత్తయ్య

**కొండపాక, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** ఉపాధ్యాయులు కొంచం కష్టపడితే విద్యార్థులను మెరికల్ల తయారు చేయవచ్చునని ఎంఈఓ బచ్చలి సత్తయ్య అన్నారు. గురువారం రాయవరం ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తయారు చేసిన బోధన, అభ్యాసన సామాగ్రిని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల వర్క్ బుక్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు చక్కగా చదువుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు కొంచం కష్టపడితే విద్యార్థుల్లో చాలామార్పు తీసుకురావచ్చునని నిరూపించిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. విద్యార్థులకు చాలా రుచికరమైన భోజనం తయారు చేసి పెడుతున్న మధ్యాహ్న బోజన కార్మికులను, ఉపాధ్యాయుల కృషిని ఆయన ప్రశంసించారు.

### ఇసుక అక్రమ నిల్వపై చర్యలు తీసుకోవాలి



ఇటుక బట్టీలలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక

**కొండపాక, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** కుకునూరుపల్లి మండల పరిధి మంగోల్ గ్రామ మదిర కాశనగర్ ప్రక్కనున్న కెసిఆర్ పేరుగల ఇటుక బట్టీలలో యాజమాని ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను(డంపు) నిల్వఉంచారు. ప్రభుత్వం అక్రమంగా ఇసుకను, మట్టిని, రేషన్ బియ్యాన్ని ప్రభుత్వ అనుమతులు లేకుండా నిల్వ ఉంచరాదని పదే పదే చెపుతున్నా బట్టీల యాజమని అధికారుల మాటలను బేఖాతర్ చేస్తూ యధేచ్ఛగా ప్రభుత్వ అనుమతులు లేకుండా నిల్వ ఉంచారు. అంతేకాకుండా ఇటుకలు తయారు చేయడానికి ఉపయోగించే మట్టిని వివిధ గ్రామాల్లోని చెరువుల్లో నుండి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా వందల లారీల తరలించి గుట్టలు గుట్టలుగా పోసి నిల్వ చేశారు. ఇప్పటికైన ఇరిగేషన్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు కాని, టాస్క్ ఫోర్స్ అధికారులు కాని నిల్వ ఉంచిన ఇసుక, మట్టిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## లేబర్ బోర్డు చైర్మన్‌ను వెంటనే నియమించాలి

### భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఉన్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం లేబర్ బోర్డు చైర్మన్‌ను ప్రభుత్వం వెంటనే నియమించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రం కోరారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యలను చెప్పుకోవడానికి లేబర్ బోర్డు చైర్మన్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్న నేటికీ లేబర్ బోర్డు చైర్మన్‌ను నియమించకపోవడం సరి కాదన్నారు. లేబర్ బోర్డులో ఉన్న రూ.2 వేల కోట్లు భవన నిర్మాణ కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగితే నిధులు కేటాయించే పరిస్థితి లేదన్నారు. కార్మికులకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యత నివ్వాలన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు కార్మికుల పక్షాన మాట్లాడడం శుభ సూచకమన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి లేబర్ బోర్డు కమిషన్ చైర్మన్‌ను నియమించేలా కార్మికుల సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలని ఆయన మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు.

# పాఠశాల, కళాశాలను అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి(తొగుట) :** తొగుట మండలం రాంపూర్‌లోగల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కళాశాలను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి తరగతి గదిలో ఇంటర్ రెండో సంవత్సరం, పదోతరగతి విద్యార్థులకు పరీక్షా సమయంలో ఏ విధంగా చదవాలో ఏ విధంగా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలో వివరించడంతో పాటు భయం లేకుండా పరీక్షలు ఎలా రాయాలో వివరించారు. పాఠశాలలోని తాగునీటి వసతి, భోజనశాల, పడకగదులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. అనంతరం తొగుటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి ప్రతి రోజు ఎంత మంది పేషంట్లు వస్తారు ఎంత మందికి పరీక్షలు చేస్తారని డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించారు. రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



హుండీల ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

## మల్లన్న హుండీల ఆదాయం రూ.78,31,047

**కొమురవెల్లి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి 19 రోజుల హుండీల ఆదాయాన్ని గురువారం ఆలయ ఆవరణలో లెక్కించారు. 19రోజుల హుండీల ఆదాయంలో భాగంగా రూ.78,31,047 నగదు, 82 గ్రాముల మిశ్రమ బంగారం,5 కిలలో మిశ్రమ వెండి, 130 విదేశీ కరెన్సీ నోట్లు, 13 క్వింటాళ్ల బియ్యం లభించినట్లు ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, ధర్మకర్తలు రవికుమార్, కొప్పరపు జయప్రకాష్‌రెడ్డి, కాయిత మోహన్‌రెడ్డి, చిగిరి కొమురయ్య, వల్లాద్రి అంజిరెడ్డి, మామిడాల లక్ష్మి, శ్రీరాములు, సురేందర్, అర్చకులు,సిబ్బంది పాల్గొన్నారు.

### రైతులను అవమానించిన ఎఇవోపై చర్యలు తీసుకోవాలి




పొలంలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

**హత్నూర ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** రైతులను అవమానపరిచే విధంగా వ్యవహరించిన ఏఈఓ మహేందర్‌పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కాసాల రైతులు డిమాండ్ చేస్తున్నారు.హత్నూర మండలంకాసాల దౌల్తాబాద్ (క్లస్టర్) పరిధిలో గల రైతు వేదిక కార్యాలయానికి గురువారం వెళ్లి రైతుబంధు డబ్బులు రాలేదని అడుగగా పెట్రోల్ పోసుకొని లేదా పురుగుల మందు తాగి చనిపోతేనే వస్తుందని వ్యవసాయ విస్తీర్ణఅధికారి మహేందర్ బాధ్యత లేకుండా అవమానించే విధంగా వ్యవహరించాడని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, రైతులు పొలంలో పురుగుల మందు డబ్బాలు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఏఈఓ మహేందర్ ను వ్యతిరేకిస్తూ నినాదాలు ఇచ్చారు.రైతుబంధు డబ్బులు రాలేదని అడగడం తప్పా అని రైతులు ప్రశ్నిస్తున్నారు.ఉన్నతాధికారులు వెంటనే ఏఈఓ మహేందర్ పై చర్యలు తీసుకోవాలని రైతులు శ్రీనివాస్ గౌడ్, ప్రభుకృష్ణ, ఎండీ. అఖిల్, మల్లేశం, మహేందర్, కృష్ణ డిమాండ్ చేశారు. ఈ విషయమై ఏఈఓ మహేందర్ మాట్లాడారు. రైతుబంధు గురించి అడగగా రాలేదని, రావడానికి సమయం పడుతుందని మాత్రమే చెప్పానని అన్నారు. ఎవరిని అవమానపరచలేదని బదులిచ్చారు.

## బిజెపి ఎన్నికల ప్రచారం

**హత్నూర, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో హత్నూర మండలంలోని వివిధ విద్య సంస్థల్లో ఉపాధ్యాయ మరియు పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల పక్షాన గురువారం ఎన్నికల ప్రచారంను బీజేపీ మండల అధ్యక్షుడు నాగప్రభు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నర్సాపూర్ ఎన్నికల ఇంచార్జీ నూకల పద్మారెడ్డి , బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘువీరా రెడ్డి,బీజేపీ మండల నాయకులు ప్రభాకర్ రాకేష్ మల్లేష్ సాయిరాం శేఖర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిజెపి నాయకులు




ఆందోళనకు దిగిన మృతుని బంధువులు

# ప్రైవేట్ ఆస్పత్రిలో వ్యక్తి మృతి

### ఆందోళనకు దిగిన మృతుడి బంధువులు

**సంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** సంగారెడ్డి పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో వ్యక్తి చనిపోవడంతో అతడి బంధువులు ఆందోళన చేపట్టడంతో గురువారం కొంత సేపు ఉద్రుత పరిస్థితులు ఏర్పడ్డాయి.విషయం తెలుసుకున్న సంగారెడ్డి డి.ఎస్.పి, సీఐలు పోలీసు బందోబస్తుతో చేరుకొని పరిస్థితులను అదుపుచేశారు మృతుని బంధువుల కథనం ప్రకారం కొండాపూర్ మండలం గారకుర్తి గ్రామానికి చెందిన వెల్దురి శ్రీనివాస్ తరచూ గురక సమస్య వస్తుండంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు సంగారెడ్డిలోని పద్మావతి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి బుధవారం మధ్యాహ్నం తీసుకు వచ్చారు. ఆయనను పరీక్షించిన సంగారెడ్డిలోని పద్మావతి ఆసుపత్రి వైద్యులు ముక్కులో బోను పెరిగింది ఆపరేషన్ చేస్తే తగ్గుతుందని తెలిపారని అన్నారు. బుధవారం ముక్కులో బోనుకు ఆపరేషన్ చేశారు. అయితే రాత్రి 2.00 గంటలకు శ్రీనివాస్ (42) చనిపోయారని కుటుంబ సభ్యులకు వైద్యులు తెలిపారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ఎలా చనిపోతాడని .కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం వ్యక్తం చేస్తూ ఆసుపత్రి ముందు ఆందోళన చేశారు. మృతుని బంధువులకు ఆసుపత్రి యాజమాన్యాము సిబ్బందికి మధ్య తీవ్ర వాగ్వివాదం చేసుకోవడంతో పాటు తోపులాట జరిగింది.విషయం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రి వద్దకు చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. మృతునికి ఇద్దరు కూతుళ్ల ఒక కుమారుడు ఉన్నారు. పద్మావతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన శ్రీనివాస్ మృతిపై అతని సోదరుడు నాగేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సంగారెడ్డి పట్టణ సిఐ రమేష్ తెలిపారు.

### విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

**కొమురవెల్లి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పదోతరగతి విద్యార్థులకు బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బి.రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పరీక్ష సామాగ్రి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తమ ఫలి తాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తేవాలన్నారు. టెన్త్‌లో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.11,116, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.5116 అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు గజ్జె వెంకటేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి అండగా ఉంటాం : ఎస్పీ

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మునిపల్లి మండలం, అంతారం గ్రామానికి చెందిన మృతురాలు ఆలియా బేగం కుటుంబాన్ని గురువారం జిల్లా ఎస్పీ పరామర్శించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మునిపల్లి మండలం, అంతారం గ్రామంలో మహ్మద్ ఇస్మాయిల్ మరియు కొల్లూరి వీరా రెడ్డి, విజయ్ రెడ్డిల మధ్య జరిగిన గొడవలో విడిపించడానికి వెళ్ళిన ఇస్మాయిల్ కూతురు ఆలియా బేగం,ప్రమాదవశాత్తు గాయపడి, చికిత్స పొందుతూ మరణించడం జరిగిందని . ఆమె అకాల మరణం వారి కుటుంబానికి తీరని లోటు అని,సంతాపం వ్యక్తం చేశారు.ఎలాంటి సమస్యలున్న నేరుగా నాతో మాట్లాడొచ్చు అని జిల్లా ఎస్పీ సూచించారు. ఇందుకు కారణమైన నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేసి జుడీషియల్ రిమాండ్ కు పంపించడం జరిగిందని అన్నారు. మృతురాలు ఆలియా బేగంపైన వారికి ఎలాంటి కక్షలేదని, కేవలం ప్రమాదవశాత్తు జరిగిన ఘటనగా భావించాలని ఎస్పీ అన్నారు.ఈ విషయమై ఎవరైనా సామాజిక మాధ్యమాలలో రెచ్చగొట్టే విధంగా పోస్ట్ లు పెట్టిన, వ్యాక్యలు చేసిన అట్టి వ్యక్తులపై చట్ట రిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.ఎస్పీ వెంబడి సంగారెడ్డి డియస్పీ సత్యయ్య గౌడ్, కొండాపూర్ ఇన్స్పెక్టర్ డి. వెంకటేష్, మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్



మాట్లాడుతున్న ఉద్యోగులు

### పోస్టు మెట్రిక్ హాస్టల్ ఉద్యోగులకు

## కన్వెన్షన్ జీవో వర్తించేలా చూడాలి

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** బీసీ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పోస్టు మెట్రిక్ హాస్టల్‌లో పనిచేస్తున్న తమకు కన్వెన్షన్ జీవో వర్తించేలా చేసి జీతాలను ఇప్పించాలని బాధితులు జి.శ్రీకాంత్, ఈ.కృష్ణ, బిక్షపతి, లక్ష్మీ, కళ్యాణీ, యశోద, జ్యోతి, ఎం.జ్యోతి కోరారు. సిద్దిపేట పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు.బీసీ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌లో ఔట్ సోర్సింగ్ విధానంలో పోస్టు వెల్ఫేర్ హాస్టల్‌లో 49 మంది వర్కర్స్ పని చేయగా 28 మందికి మాత్రమే కంటి న్యూషన్ జీవో ఇచ్చి మిగిలిన 21 మంది ఉద్యోగులకి కంటిన్యూషన్ జీవో వర్తించేలా సంబంధిత బీసీ వెల్ఫేర్ మినిస్టర్, అధికారులు సమస్యపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి సమస్య పరిష్కరించి ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని జెఎసి సిద్దిపేట జిల్లాశాఖ నాయకులు డిమాండ్ చేశారు.

### బిఆర్ఎస్ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన మాదాసు

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం కోమటి బండ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త ఉబ్బని ప్రభాకర్ తండ్రి ఉబ్బని నర్సయ్య మృతిచెందగా విషయం తెలుసుకున్న గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ గురువారం బాధిత కుటుంబాన్ని పిఎసిఎస్ చైర్మన్ వెంకటేష్‌గౌడ్‌తో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటికి పెద్దదిక్కు కోల్పోవడంతో వారికి ధైర్యం చెప్పడంతోపాటు ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఆయన వెంట బిఆర్ఎస్ మండల మాజీ వైస్ ఎంపిపి కృష్ణగౌడ్, ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ శేఖర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు భాస్కర్, దుర్గారెడ్డి తదితరులు వున్నారు.

### మండల సమైక్య కార్యాలయంలో శిక్షణ

**వెల్దుర్తి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** మండలకేంద్రంలోని మండల సమైక్య కార్యాలయంలో గురువారం వివోఏలు, గ్రామ సంఘం ఆఫీస్ బేరర్‌లు, గ్రామ సంఘం సబ్ కమిటీ మెంబర్లకు ఆరోగ్యం, పోషణ, పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, జెండర్ అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రతి స్వయం సహాయక సంఘం ద్వితీయ సమావేశాలు నిర్వహించుకొని ఆరోగ్యమే మహాభాగ్యం, ఆహారంతో ఆరోగ్యం, పోషకాలు నష్టపోకుండా వంట చేసే పద్ధతులు, పిల్లలు పోషణ, రక్తహీనత,1000 రోజుల ప్రాముఖ్యత, పిల్లల పోషణకు పాటించే పద్ధతులు, చేతుల పరిశుభ్రత, సమతుల్య ఆహారం, చెత్త నివారణ, పర్యావరణ పారిశుద్ధ్యం మొదలగు అంశాలపై అంశాలపై చర్చించుకోవాలని చెప్పడం జరిగింది. అలాగే శిక్షణ ఇవ్వడం జరిగింది. స్వయం సహాయక సంఘాలు ప్రతి నెల ద్వితీయ సమావేశాలు నిర్వహించుకొని పై అంశాలపై అవగాహన కల్పించాలని శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు నవనీత, కార్యదర్శి ప్రమీల, కోశాధికారి శ్యామల, ఏపీఎం శంకరయ్య, సీసీలు, వైద్య సిబ్బంది కృష్ణవేణి, లలిత, అంగన్వాడి సూపర్‌వైజర్ వరలక్ష్మీ, అంగన్వాడీ టీచర్లు, వివోఏలు, గ్రామ సంఘం ఆఫీస్ బేరర్‌లు, సబ్ కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

### మహాశివరాత్రికి 1.08 కోటి రుద్రాక్షలతో మహాశివలింగం



మాట్లాడుతున్న మహేశ్వరశర్మ సిద్ధాంతి

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** ఈనెల 26వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా 1.08 కోటి రుద్రాక్షలతో మహా శివలింగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీజ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీ మహేశ్వరశర్మ సిద్ధాంతి తెలిపారు. సంగారెడ్డిమండలం ఫసల్వాది లోని ఆశ్రమంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శివలింగం 18.50 అడుగుల ఉంటుందని పేర్కొన్నారు 23వ తేదీన ఫసల్వాదిలోని ఆశ్రమంలో రుద్రాక్షలతో తయారుచేసిన శివలింగాన్ని ఆవిష్కరిస్తామని చెప్పారు. శివలింగానికి భక్తులు అభిషేకంచేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో మహాశివరాత్రికి పాల్గొనాలని కోరారు. సమావేశంలో విద్యాపీఠం సభ్యులు తోపాజి అనంత కిషన్, ప్రశాంత్ కుమార్ దారం సంజయ్ కుమార్, కృష్ణ మూర్తి, రాము, విట్టల్ దాస్, పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**హత్నూర ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** హత్నూర మండల పరిధిలోని నాగు దేవ్ పల్లి గ్రామానికి చెందిన సీఎం సహాయనిధి లబ్దిదారులు కుమ్మరి ఆంజనేయులు రూ.39000, జోగమొల్ల సాయిలు రూ.9500 రూపాయలు గల చెక్కులను లబ్దిదారులకు ఎమ్మెల్యే సూచనల మేరకు గురువారం అందజేసినట్లు హత్నూర మండల టిఆర్ఎస్ పార్టీ నాయకులు దూది పోచయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ బాయికాడి సుధాకర్,పార్టీ అధ్యక్షులు దూడి పోచయ్య, ఉప సర్పంచ్ దౌలపురం కృష్ణ,తిరుపతి సుధాకర్,దూడి ఆంజనేయులు,నిరుడు పోచయ్య, కుమ్మరి పోచెట్టి తదితరులు పాల్గొన్నారు.

**సిరిపురం గ్రామంలో....** సిరిపురం గ్రామానికి చెందిన పూల బిక్షపతి కి సీఎంఆర్ఎఫ్ 15000 చెక్కును అందజేసినట్లు మచ్చ నరేందర్ తెలిపారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి కమ్మరి సత్యనారాయణ బుచ్చయ్య పందరి నర్సింలు మున్నా తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలి

### సిఐటియు జిల్లా కార్యదర్శి బాలమణి

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపాలిటీలో పారిశుధ్య పనులు చేస్తున్న సపాయి కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించకుండా మున్సిపల్ అధికారులు వేధిస్తున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలమణి ఆరోపించారు. గురువారం నాడు స్థానిక మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తమకు సకాలంలో జీతాలు, 8 నెలలుగా పిఎఫ్ డబ్బులు అందడం లేదని ఆరోపిస్తూ, పనులను నిలిపివేసి మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసనకు దిగారు. అట్టి నిరసన కార్యక్రమానికి మద్దతుగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలమణి కార్మికులతో కలసి బైఠాయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామాయంపేట మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులతో అధికారులు వెట్టిచాకిరి చేయిస్తున్నారని మండిపడ్డారు. వారికి సకాలంలో వేతనాలు చెల్లించడంలేదని, గత 8 నెలలుగా పిఎఫ్ డబ్బులు కూడా ఇవ్వడం లేదన్నారు. ఉదయం 5 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు వారు విధులు నిర్వహిస్తున్నారని, అయినప్పటికీ మున్సిపల్ అధికారులు వారిని ఇబ్బంది పెడుతున్నారని కార్మికులు ఆవేదన చెందుతున్నారన్నారు. గత పాలకవర్గం రేపు,మాపు అంటూ కాలం గడిపిందని, వారి పదవీ కాలం ముగిసిందని, ఇప్పుడు కమీషనర్ కూడా సపాయి కార్మికులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. కార్మికులకు కనీసం సబ్బులు, నూనె లాంటి కాస్మోటిక్ కూడా సరఫరా చేయకపోవడంతో వారు అనారోగ్యాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం చెత్తలో, మురికికాలువలలో పని చేసే తమకు కనీసం చేతులకు తొడుక్కునే గ్లౌస్‌లు, దుర్వాసనను తట్టుకునేందుకు మాస్కులు కూడా ఇవ్వడం లేదని కార్మికులు ఆవేదనతో తెలిపారు. ఇప్పటికైనా అధికారులు దిగివచ్చి, కార్మికులకు అందాల్సిన పిఎఫ్‌డబ్బులు, కాస్మొటిక్ అందించి, ప్రతి నెల సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

లేనిపక్షంలో పట్టణంలో పారిశుధ్య పను లను నిలిపివేసి, కార్మికులతో కలిసి నిరవధిక సమ్మె కు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రాంబాబు, సిద్దవ్వ,గావు రమేష్, సంగనాథ్ పల్లి బాబు, సిద్దరాములు, గోపి, బి. రమేష్, భైరం నర్సవ్వ, సువర్ణ, పర్శరాములు పాల్గొన్నారు.



మున్సిపాలిటీ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన పారిశుధ్య కార్మికులు

## అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** మద్యం మత్తులో ఇరువు మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. సిద్దిపేట టూ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని నర్సాపూర్ రోడ్డులోగల గ్యాదరి మైసమ్మ ఆలయం సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెంది ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎసిపి మధు, టూ టౌన్ సీఐ ఉపేందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ సహాయంతో ఆధారాలు సేకరించి మాట్లాడారు. తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లికి చెందిన బోదాసు శ్రీనివాస్ సిద్దిపేట పట్టణంలోని కెసిఆర్ నగర్ డబుల్ బెడ్ రూంలలో తల్లి వద్ద ఉంటున్నట్లు తెలిపారు. శ్రీనివాస్‌ను హత్య చేశారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు. హత్య చేసిన నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. మృతుడిపై చిన్న, చిన్న దొంగతనాల కేసులు ఉన్నట్లు వివరించారు. మద్యం మత్తులో పడిన ఘర్షణతోనే హత్యకు పాల్పడినట్లు తెలుస్తుందన్నారు.

### పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

**చేర్యాల, ఫిబ్రవరి 20,ప్రభాతవార్త :** చేర్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మద్రిముస్త్యాల గ్రామంలో బుదిగం బాల్‌రెడ్డి వ్యవసాయ పొలం వద్ద కొంత మంది పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందడంతో చేర్యాల పోలీసులతో కలిసి వెళ్లి దాడులు నిర్వహి ంచారు. ఈ దాడుల్లో మద్రి ముస్త్యాల గ్రామానికి చెందిన జంగని రాజు,తురాయి కిషన్‌గౌడ్,సారా జన్దాన్,జంగని రవి,చామంతుల రమేష్,కంటే శ్రీనివాస్‌లు పట్టుబడ్డారు.వారి నుండి రూ.2107/-నగదు, 5మొబైల్ ఫోన్లు,6మోటారు సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ఎవరైన చట్టవ్యతిరేఖ కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఖాజాపూర్ పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈఓ, తహసీల్దార్

## పాఠశాలను తనిఖీ చేసిన అధికారులు

**సిర్గాపూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఖాజాపూర్ గ్రామంలోని ఎంపిపిఎస్ పాఠశాలను గురువారం ఎంఈఓ నాగారం శ్రీనివాస్, తహసీల్దార్ ఉమాశంకర్‌లు తనిఖీ చేశారు. ఎండిఎం, ఎఫ్ఆర్ఎస్, పిల్లల విద్యాప్రగతిని ప్రధానోపాధ్యాయులు మారుతిరావును ఎంఈఓ, తహసీల్దార్‌లు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## నాగల్‌గిద్దలో అఖండ హరినామ సప్తహా ప్రారంభం



నాగల్‌గిద్దలో ప్రారంభమైన అఖండ హరినామ సప్తహా భజనల దృశ్యం

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 20, ప్రభాతార్త:** మండల కేంద్రంలోని శివాలయంలో బుధవారం అఖండ హరినామ సప్తహాభజనలు భక్తిశ్రద్దలతో ప్రారంభించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో సప్తహా భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు భజన మండలి బాధ్యులు పేర్కొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో బిజెపి నేతలు



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న బిజెపి నాయకులు

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు చేసి శాసనమండలి మెట్లు ఎక్కేలా చేయాలని పట్టభద్రులకు పార్టీ మండల అధ్యక్షులు రమేష్ వినతి చేశారు. మండల కేంద్రమైన నాగల్‌గిద్దతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని పట్టభద్రులను ప్రత్యేకంగా కలుసుకుని అంజిరెడ్డికి మద్దతు పలకాలని ప్రచారం చేశారు.

## జోగిపేటలో బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచారం



జోగిపేటలో ప్రచారం నిర్వహిస్తున్న బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులు

**జోగిపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారంనాడు జోగిపేటలో బిజెపి అభ్యర్థులు అంజిరెడ్డి, మల్కా కొమురయ్య ప్రచారం నిర్వహించారు. జోగిపేటలోని నియోవివేకానంద పాఠశాలలో ప్రచారం చేస్తూ మొదటి ప్రాధాన్యతా ఓటు తమకు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారివెంబడి జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, నియోజకవర్గ నాయకులు ఆంజనేయులు గౌడ్, నాయకులు భూమయ్య, మృత్యుంజయులు పాల్గొన్నారు.

## వనదుర్గమ్మను దర్శించుకున్న ఆకాష్



దుర్గా మాతను దర్శించుకుంటున్న పూరి జగన్నాథ్ తనయుడు ఆకాష్

**పాపన్నపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ప్రసిద్ద పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గా భవాని మాతను గురువారం చలన చిత్ర దర్శకులు పూరి జగన్నాథ్ తనయుడు పూర్తి ఆకాష్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆశాష్ ఆలయంలో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆకాష్‌కు ఆశీర్వచనలు చేసి తీర్థ ప్రసాదాలు అందచేశారు.

## కడపల్‌లో కాల కీర్తన సేవ

**సిర్గాపూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మండల పరిధలోని కడపల్‌లో నిర్వహించిన కాల కీర్తన సేవా కార్యక్రమంలో శ్రీకరణ్ గజేంద్ర భారతి మహా రాజ్ పాల్గొని కీర్తనలు వినిపించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ పుర వీధులలో గోపాల కాలువ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామంతో పాటు పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

## రక్త దానం చేసిన పోలీస్

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 20,ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. కుటుంబ సభ్యులు నార్సింగేలోని ప్రవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆమెకు శస్త్రచికిత్స చేయించాల్సి ఉందని, రక్తంకావాలని వారికి సూచించారు. సానీక్ష ఫౌండేషన్ చైర్మన్ శివనాయక్ దృష్టికి తీసుకెళ్లగా రక్తదానం వాట్సప్ గ్రూప్‌లో రక్తం అత్యవసరంగా కావాలని సందేశాన్ని పంపగా స్పందించిన రామాయంపేట పోలీస్‌స్టేషన్‌లోని కానిస్టెబుల్ శ్రీనివాస్‌నాయక్ స్పందించి ఆసుపత్రికి వచ్చి రక్తదానం చేశారు.

## వరి కొనుగోలుపై అవగాహన

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ధాన్యంకొనుగోలులో తీసుకోవాల్సిన మేళకువలపై గురూరం అధికారులు అల్లాదుర్గంతోపాటు మండలంలోని పెద్దాపూర్, ముస్లాపూర్, అప్పాజిపల్లి గ్రామాల్లో రైతు లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి, జిల్లా కోఆపరేటివ్ అధికారి కరుణాకర్, వ్యవసాయాధికారి రాజేష్ కుమార్ మాట్లాడుతూ వరికోసే యంత్రాన్ని రెండవగేర్‌లో నడపాలని, ఫ్యాన్ స్పీడ్ ఆర్‌పిఎం 19-20 ఉంచాలని, బ్లూవర్ ఆన్‌లైన్‌లో ఉంచాలని వివరించారు. వరి కేంద్రానికి ధాన్యం శుభ్రపరిచి, తేమ 17 శాతం ఉన్న ధాన్యంను తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీరణ అధికారులు నవీన్, విఠల్, అమృత,రాజు, కురుమ నాగయ్య పాల్గొన్నారు.

# జాతరను జయప్రదం చేయాలి

### మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

**పాపన్నపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాలను పురస్కరించుకుని ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయ పరిసరాల్లో నిర్వహించే జాతరను జయప్రదం చేసేందుకు అధికారుల సమన్వయంతో పనులు నిర్వహించాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. గురువారం ఆలయానికి చేరుకున్న అదనపు కలెక్టర్ నగేష్ ముందుగా అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతర ఉత్సవాల ఏర్పాట్లను ఈ నెల 24వ తేదీ వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. 26 నుంచి 28వ తేదీవరకు జరిగే మహాశివరాత్రి జాతరకు ఆయా ప్రాంతాల నుంచి లక్షలాధిగా భక్తులు చేరుకుంటారని, భక్తులు అసౌకర్యానికి గురికాకుండా తగు రీతిలో ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయ క్షేత్రాన్ని ప్లాస్టిక్ రహిత క్షేత్రంగా మార్చాలని, అందుకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. జాతరను పురస్కరించుకుని వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయాలని, తాత్కాలిక శౌచాలయాలు ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల పార్కింగ్ ప్రాంతం నుంచి రాజగోపురం వరకు బ్యాటరీ ఆటోలు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ధర్మదర్శనానికి అదనపు క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్, డిఎస్‌పి ప్రసన్నకుమార్, డిఎల్‌పిఓ సురేష్‌బాబు, పంచాయితీరాజ్ అధికారులు, పంచాయితీ కార్యదర్శి దుర్గాభవాని, ప్రత్యేక అధికారి విజయ్‌కుమార్, ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, శ్యామ్‌రావు, నరేష్, మహేష్, యాదగౌడ్, బత్తిని రాజు, వర్ణాచారి, బ్రహ్మాచారి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సబ్ డివిజన్ ఎడిఇగా శ్రీనివాస్

**పాపన్నపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** పాపన్నపేట సబ్ డివిజన్ విద్యుత్ శాఖ ఏడీఈగా శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బంజారాహిల్స్ కార్యాలయంలో విధులునిర్వహించిన శ్రీనివాస్‌ను మండలానికి బదిలీ చేయడంతో శ్రీనివాస్ కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకుఇక్కడ విధులు నిర్వహించిన మోహన్‌బాబు మెదక్‌కు బదిలీ అయ్యారు.

## గీతం అధ్యాపకుడు రవి హనుమంతుకు డాక్టరేట్

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 20,ప్రభాతవార్త:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని టెక్నాలజీ విభాగం పరిశోధక విద్యార్థి, మెకానికల్ ఇంజనీరింగ్ అధ్యాపకుడు రవి హనుమంతు డాక్టరేట్‌కు అర్హత సాధించారు. వివిధ ఆపరేటింగ్ పారామితులలో టెర్నరీ ఇంధనంతో ఇంధనంగా ఉన్న ఆర్ సీసీఐ ఇంజిన్ ప్రవర్తన, వ్యాయామ విశ్లేషణ మెరుగుదల్మ అనే అంశంపై సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.సీతారామయ్య గురువారం ఈ విషయాన్ని వెల్లడించారు. రవి హనుమంతు పరిశోధన అధ్యయనం ప్రకారం, అధునాతన దహన చాంబర్ డిజైన్ తో పాటు, టెర్నరీ ఇంధన మిశ్రమాలు, మెరుగుదల చేసిన ఇంజెక్షన్ పారామితులను ఉపయోగించి, ఆర్ సీసీఐ ఇంజిన్లు ఇంజిన్ సామర్థ్యాన్ని పెంచడానికి, ఉద్గారాలను తగ్గించడానికి స్థిరమైన విధానాన్ని అందిస్తాయి. ఇది వాటిని సాంప్రదాయ డీజిల్ ఇంజిన్ లకు ఆచరణీయమైన, ఆశాజకమైన ప్రత్యామ్నాయంగా చేస్తుంది. రవి హనుమంతు సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్ డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్ రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.ఆర్.శాస్త్రి, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ పి.శ్రీనివాస్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు పేర్కొన్నారు.

## వైద్య శిబిరాన్ని ప్రారంభించిన డిఎస్‌పి

**జహీరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**

పట్టణంలోని నీలం హస్పిటల్, సిఎం క్యాన్సర్ కేర్‌సెంటర్ హైద్రాబాద్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా నీలం ఆసుపత్రి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం శుభపరిణా మమన్నారు. వైద్య శిబిరాలను ప్రజలు ఎల్లప్పుడు సద్వినియోగం చేసుకుంటూ ఉండాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సిఐ శివలింగం,ఎస్ఐ ఎం కాశీనాథ్, నీలం ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మహమ్మద్ నవాజ్ అలీ, డాక్టర్ రాజేందర్ బై శెట్టి, డాక్టర్ లలిత, నిర్వాహకులు మోయిద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల హక్కులను పరిరక్షించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

**నర్సాపూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** పట్టభద్రుల హక్కులను పరిరక్షించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి లు అన్నారు. గురువారంనర్సాపూర్ పట్టణంలోని శ్రీ సాయి కృష్ణ గార్డెన్స్ లో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెదక్,నిజామాబాద్, ఆదిలాబాద్,కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతు ప్రకటించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ఎన్నికల బాధ్యులు, దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పిసిసి ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ లు మాట్లాడుతూకాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చిన వెంటనే 50,000 ఉద్యోగాలు భర్తీ చేశారన్నారు.రాష్ట్రంలోని గురుకుల సంక్షేమ కేంద్రాలో మెస్ ఛార్జీలను పెంచి విద్యార్థులకు కార్పొరేట్ హాస్టల్‌తరహాలో నాణ్యమైన భోజనాన్ని అంది స్తుందని తెలిపారు. పట్టభద్రుల హక్కులను పరిరక్షించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అన్నారు. రాష్ట్రంలో జాబ్ క్యాలెండర్ ను ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ మే నన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత విద్య, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కట్టుబడి ఉందని వివరించారు.

కాంగ్రెస్ హయాంలోనే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్, ఉపకార వేతనాలు లభించాయని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టభద్రులను విస్మరించిందని, తప్పుడు విధానాలతో విద్యార్థుల భవిష్యత్తును సంక్షోభంలోకి నెట్టింది అని విమర్శించారు. ఈ మేరకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, నిజమైన విద్యావంతుల గొంతుకను శాసన మండలిలోకి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు భవాని, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం, నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు పట్ట పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వర్తక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

## 16వ రోజుకు చేరిన నిరాహార దీక్షలు

### -స్వచ్ఛందంగా దుకాణాలు బంద్.. వర్తక సంఘం ఆధ్వర్యంలో ధర్నా

**గుమ్మడిదల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ అటవీ ప్రాంతంలో జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డ్ ఏర్పాటును నిరసిస్తూ చేపట్టిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. గుమ్మడిదలలో రైతు జేఏసీ అధ్యక్షులు చిమ్ముల జైపాల్ రెడ్డి, మహిళా జేఏసీ అధ్యక్షురాలు మల్లమ్మలు ఆధ్వర్యంలో గురువారం జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. వర్తక సంఘం సభ్యులు వాణిజ్య సముదాయాలను స్వచ్ఛందంగా బంద్ నిర్వహించి ధర్నా శిబిరంలో కూర్చొని డంపింగ్ యార్డ్, జీహెచ్ఎంసీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. అలాగే గుమ్మడిదల మండలం నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాలలో యధావిధిగా 16వ రోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్తక సంఘం సభ్యులు గుమ్మడిదల మండల జేఏసీ కమిటీకి 20 వేల రూపాయల విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షులు ఆకుల సత్యనారాయణ, తాజా మాజీ జెడ్పీటీసీ కుమార్ గౌడ్, చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, సూర్యనారాయణ, మద్దుల బాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, గోపాల్, వాసుదేవ రెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, ఆంజనేయులు యాదవ్, శంకర్ యాదవ్, కర్ణాకర్ రెడ్డి, పట్టణ వర్తక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 18న జిల్లా బ్రాహ్మణ సంఘం ఎన్నికలు



ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తున్న రవీంద్రశర్మ

**రామాయంపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** మార్చి 18వ తేదీన తూప్రాన్ పట్టణంలో జిల్లా బ్రాహ్మణ సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల ప్రధాన అధికారి సోమయాజుల రవీంద్రశర్మ, సహాయ ఎన్నికల అధికారులు శాస్త్రుల మధుశ్రీశర్మ, డి.జి.శ్రీనివాసశర్మ తెలిపారు. ఇటీవల తూప్రాన్ పట్టణంలో జరిగిన జిల్లా బ్రాహ్మణ సంఘం ఎన్నికల సన్నాహక సమావేశంలో సంఘం బాధ్యులందరూ కలిసి ఎన్నికల అధికారులను నియమించుకోవడం జరిగిందన్నారు. ఎన్నికలు సజావుగా సాగడానికి అన్నిరకాల చర్యలు తీసుకుంటామని, నర్సాపూర్, మెదక్, తూప్రాన్ డివిజన్లకు సంబంధించిన సభ్యుల ఓటర్ లిస్ట్‌ను ఆయా డివిజన్ అధ్యక్షులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. అయితే ఇప్పటికే జిల్లా బ్రాహ్మణ సంఘం ఎన్నికలు పూర్తయ్యాయని, అధ్యక్షుడిగా శలాక రాజేశ్వర శర్మ ఎన్నికైనట్లు, ఎన్నికల అధికారుల ప్రకటన లాంచనమే ఉందని ఒక పత్రికలో వచ్చిన వార్త పూర్తిగా అసత్యమని ఎన్నికల అధికారులతో పాటుగా శలాక రాజేశ్వర శర్మ ప్రకటించారు. ఈ విషయంలో జిల్లా బ్రాహ్మణ సంఘం సభ్యులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రజాస్వామ్యబద్దంగా జిల్లా ఎన్నికలు నిర్వహిస్తామని వారు హామీ ఇచ్చారు. ఆరోజు జిల్లా సంఘంలో సభ్యత్వం ఉన్నవారు ఎవరైనా పోటీ చేయవచ్చని తెలిపారు.

## వరి విత్తనాల నాణ్యతపై అవగాహన సదస్సు

**వెల్దుర్తి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:**

మండల పరిధిలోని బండపోసానిపల్లి, వెల్దుర్తి, హస్తాల్‌పూర్, మన్నెవారి జలాల్‌పూర్, కుకునూరు గ్రామాల్లోని రైతువేదికల్లో పౌర సరఫరాల శాఖ ద్వారా వరి విత్తనాల నాణ్యత ప్రమాణాల గురించి ఏడీఏ విజయలక్ష్మీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి కోత చేసేటప్పుడు హార్వెస్టర్ ఆర్‌పీఎం 1800-2100 మధ్యలో ఉండాలని అన్నారు. రైతులు వరి ధాన్యాన్ని కల్లాల దగ్గరే పోసుకోవాలని, వడ్లు కేంద్రాలకు తెచ్చిన తర్వాత తేమ శాతం 17 కంటే తక్కువ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో రామ్ శివ, ఏఈవోలు మజీద్ అలీ, ఉత్తమ్, వందన, రేవతి, గౌతమి, రైతులు పాల్గొన్నారు.

# దోపిడీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

### రూ. 4.50 కోట్ల విలువగల పల్లాడియం స్వాధీనం.. వివరాలు తెలిపిన జిల్లా ఎస్‌పి రూపేష్ చెన్నూరి





పోలీసుల అదుపులో అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా

**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ఫార్మ కంపెనీలలో పల్లాడియం కార్బన్‌ను చోరీ చేస్తున్న అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. దోపిడికి పాల్పడుతున్న ఆరుగురు అంతర్‌రాష్ట్ర దొంగలను సదాశివపేట పోలీసులు, సిసియస్ పోలీసులు సంయుక్తగా నిర్వహిచిన ఆపరేషన్‌లో పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి రూపేష్ చెన్నూరి వివరాలను వెల్లడించారు. ఫిబ్రవరి 8, 9 తేదీలలో సదాశివపేట పోలీసు ఠాణా పరిధిలోని యావాపూర్ గ్రామంలోగల అరీన్‌లైఫ్ సైన్సెస్ యూనిట్-3 కంపెనీలో పల్లాడియం కార్బన్ దొంగతానికి గురైనట్లు కంపెనీ సీనియర్ హెచ్ఆర్ మేనేజర్ మజ్జి సూపర్వల నాయుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ మేరకు కేసును చేధించేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాట చేసి ఈ నెల19న మద్దికుంట చౌరస్తాలో ఆరుగురు నేరస్తులను (నంద్యాల జిల్లా మమానంది మండలం మసీద్ పురం గ్రామానికి చెందిన అల్లం సాంబశివుడు(43), మహారాష్ట్ర పూణే దౌండడ తాలుకా దేవులగవడ గ్రామానికి చెందిన ప్రసాద్‌సాహెబ్ షిటోలే (24), ఆదిత్య ఆంకుష్ మన్నె(23), హయత్‌నగర్ లక్ష్మారెడ్డిపాలంఎ, శ్రీసాయికుటీర్ కాలనీకి చెందిన తమ్మ ముక్కంటిరెడ్డి(47), హైదరాబాద్ చింతల్ వాణినగర్ కు చెందిన మట్టా కుటుంబరావు(46), మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ గాజులరామారం గ్రామానికి చెందిన గుమ్మడి శ్రీనివాస్‌రావు(47))లను పట్టుకుని వారి నుంచి 96 కిలోల పల్లాడియ కార్బన్‌ను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఆరుగురు నిందితులతో పాటు మారుతి సుజుకి కారు, 6 సెల్‌ఫోన్లు సీజ్ చేశామని ఎస్‌పి రూపేష్ చెన్నూరి వివరించారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని నిజాంపూర్ మండలానికిచెందిన కాంగ్రెస్ నాయకులు తంతిర పోచయ్య కుమార్తె వివాహానికి ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపిటిసి సభ్యులు లింగారెడ్డి, నాయకులు రాధకిషన్ సేట్, వినోద్ పాటిల్, రఘుపతిరెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు సాహితీ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం

**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** పట్టణంలోని రైతు బజార్ ఎదురుగా ఉన్న సాహితి ఆసుపత్రిలో ఈ నెల 21న ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ రాము సాహితీ తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో డయాబెటిక్, బిపి, న్యూరో ఆర్థోలపై వైద్య పరీక్షలు చేస్తామన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగే వైద్యశిబిరాన్ని సంగారెడ్డి పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాము సాహితీ సూచించారు.

## ఈదమ్మ ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని వడ్డెరబస్తీలో కొలువున్న శ్రీఈదమ్మ ఎల్లమ్మ తల్లి దేవాలయాన్ని బిఆర్ఎస్‌నేత వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఆలయ పరిసరాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన వడ్డె ఓబన్న విగ్రహానికి పూలమాలలువేసి ఆదర్శ్‌రెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, వడ్డెర లింగయ్య, జగన్నాథ్‌రెడ్డి, వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.

## మొక్కులు చెల్లించుకున్న మారుతిరెడ్డి

**కంగ్టి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** జహీరాబాద్ లోకసభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌కుమార్‌షెట్కార్ విజయం సాధించేలా చేస్తూ శ్రీశైలంకు వచ్చి మొక్కులు చెల్లించుకుంటానని అప్పట్లో మొక్కుకున్న సొసైటీ చైర్మన్ డి.మారుతిరెడ్డి తన మొక్కులు చెల్లించుకునేందుకు శివస్వాములతో కలిసి శ్రీశైలంకు పాదయాత్రగా పయనమయ్యారు. శ్రీశైలంకు చేరుకున్న చైర్మన్ మారుతిరెడ్డి ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ పేరుపై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. చైర్మన్ మారుతిరెడ్డితో పాటు రామకృష్ణరెడ్డి, సూర్యకాంత్, రాజ్ కుమార్, సాయిలు, దత్తు, నాందేవ్‌రెడ్డి, రఘు నందన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## 22న జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

**జోగిపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ఈ నెల 22న జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్రంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రసాయన శాస్త్ర విభాగం, టిఎస్‌కెఎస్ ఆధ్వర్యంలో న్యూలాండ్ ఫార్మా కంపెనీవారు ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు అందరూ ఇందుకు అర్హులని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. జాబ్‌మేళాకు హాజరయ్యేవారు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఆధార్ కార్డుతోపాటు విద్యార్హతలకు సంబంధించిన మెమోలతో హాజరవ్వాలని ఆయన తెలిపారు.

## 27న జోగినాథస్వామి ఆలయంలో గిరి ప్రదక్షిణ

**జోగిపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ఈ నెలలో జరగనున్న మహాశివరాత్రి పండగను పురస్కరించుకుని ఈ నెల 27న జోగిపేట జోగినాథ స్వామి ఆలయం వద్ద గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటి సభ్యులు తెలిపారు. ఆ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు కార్యక్రమాలు కొనసాగుతాయని వారు తెలిపారు. ఆరోగ్యం, సకలసంపదల ప్రాప్తి, సంతానసౌభాగ్యం, మోక్షప్రాప్తి కొరకు జరిగే మహత్తరమైన గిరిప్రదక్షిణలో భక్తులందరూ అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించాలన్నారు. భక్తులందరికీ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఉంటుందని, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

## బేటీ బచావో.. బేటి పడావోపై అవగాహన

**కొల్చారం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** మండల పరిధిలోని రంగంపేట గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమానికి పది సంవత్సరాలు పూర్తయినందున మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆడపిల్లల తల్లులతో కలిసి మొక్కలు నాటడం జరిగింది. అలాగే తల్లులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సుకన్య సమృద్ధి యోజన స్కీంల గురించి మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ కవిత వివరించారు. ఈ సందర్భంగా జెండర్ స్పెషలిస్ట్ నాగమణి మాట్లాడుతూ పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్, డ్రాప్ అవుట్ పిల్లల గురించి వివరించారు. సబ్ సెంటర్‌లో ఇమలైజేషన్‌కి వచ్చిన తల్లులకు, బాలింతలకు పౌష్టికాహారం గురించి, ఆల్ హెల్ప్ లైన్ నెంబర్స్ 100, 1098, 181, 14567, 155326 ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత టీం, అంగన్వాడీ టీచర్ విజయలక్ష్మీ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, బాలింతలు, గర్భవతులు తదితరులు ఉన్నారు.



వివరాలు తెలుపుతున్న సిఐ రాజశేఖర్‌రెడ్డి

## హత్యకేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలింపు

**పాపన్నపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** అవిటి భర్తను అల్లుడితో కలిసి హత్యచేసిన భార్య, అల్లుడిని పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. పోలీసు ఠాణాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ రాజశేఖర్‌రెడ్డి ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. ఈ నెల 15న వ్యవసాయ క్షేత్రం వద్ద కాలుజారి పడిపోయిన సంఘటనలో నడవ లేని స్థితిలోకి చేరుకున్న మండల పరిధిలోని బాచారం గ్రామానికి చెందిన కర్రెల్ల ఆశయ్యను భార్య, అల్లుడితో కలిసి హతమార్చి సహజ మరణంగా చిత్రీకరించేందుకు యత్నించి గ్రామస్తులకు దొరికిపోయిన విషయం పాఠకులకు విధితమే. నడవలేని స్థితిలోకి చేరుకున్న ఆశయ్యను హతమార్చితే రైతుబీమా డబ్బులు వస్తాయన్న అత్యాశతో భర్తను అల్లుడు రమేష్‌తో కలిసి హతమార్చిందన్నారు. ఇరువురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ, ఎస్ఐలు వివరించారు.

## అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురి అరెస్ట్

**జహీరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసిన సంఘటన గురువారం కోహీర్ మండలంలోని కవేలి చౌరస్తాలో చోటుచేసుకుంది. కోహీర్ పోలీసుల కథనం ప్రకారం... కవేలి చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో టిఎస్ 13యుబి 6281 ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురిని (హైదరాబాద్ పురానాపూల్ దర్గా ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ అయూబ్(60), మియాపూర్ న్యూ హాఫీజ్‌పేటకు చెందిన మాసం వ్యాపారి మహ్మద్ ఖురేషి (39), బాలాపూర్ షాహీన్ నగర్‌కు చెందిన గౌస్‌ఖాన్(40), ఆటో డ్రైవర్ అమీర్‌ఖాన్(36)లను ప్రశ్నించగా తికమక సమాదానాలు చెప్పడంతో అనుమానాస్పదంగా నలుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆటోలో చాకు, ఐరన్ రాడ్‌తో పాటు కట్టెలను స్వాధీనం చేసుకున్నామన్నారు.





అనుమానాస్పద వ్యక్తులను అరెస్టు చేసిన పోలీసులు